"నీతిమంతుని జ్ఞాపకము చేసుకొనుట ఆశీర్వాదకరము" (సామెతలు 10:7)




## శ్రీమతి వై.ఎస్. జయమ్మ

# అత్యంత ప్రియమైన అమ్మ

## "దేవుని బలిష్ఠమైన చేతిలో దీనపాత్ర"

బి. విమలా రెడ్డి



శ్రీమతి & శ్రీ వై. ఎస్. రాజారెడ్డి

# ప్రార్థన

కృపగల మా పరలోకపు తండ్రీ, భక్తిగల జీవితం జీవించి, తన జీవితాంతం నీ ప్రశస్తమైన నామాన్ని మహిమపరచిన తల్లి గర్భాన నాకు జన్మ యిచ్చినందుకు నీకు కృతజ్ఞతలు. ఈ పుస్తకంలో వ్రాయబడిన విషయాలు పాఠకులు అర్థం చేసుకొనుటకు, గ్రహించుటకు వారిని నీ పరిశుద్ధాత్మతో నింపండి ప్రభువా. ఓ దేవా! పాఠకులందర్నీ ఆశీర్వదించండి. మా అమ్మ తన జీవితాంతం నిన్ను మహిమపరచిన విధంగా, వారు ఆమెను మాదిరిగా తీసుకొని నిన్ను మహిమపరచుటకు సహాయం చేయండి. మా అమ్మ వంటి ప్రజలతో లోకం నింపబడినప్పుడు నీ రాజ్యము భూమి మీద చూడగలుగుతాము, నీ అద్భుతమైన సన్నిధిని నిత్యము మేము అనుభవించ గలుగుతాము. ఈ ప్రార్థన మా ప్రభువును, రక్షకుడైన యేసుక్రీస్తు ప్రశస్త నామంలో ప్రార్థిస్తున్నాను తండ్రీ. ఆమేన్.

బి. విమలారెడ్డి

(శ్రీమతి వై. ఎస్. జయమ్మ రాజారెడ్డి కుమార్తె)



నా ప్రియమైన అమ్మతో నేను మరియు నా మనుమడు

# శ్రీమతి వై. ఎస్. జయమ్మ గారి

# ఇష్టమైన కీర్తన

రండి యుత్సహించి పాడుదము - రక్షణ దుర్గము మన ప్రభువే

1. రండి కృతజ్ఞత స్తోత్రముతో - రారాజు సన్నిధి కేగుదము =
సత్ప్రభు నామము కీర్తనలన్ - సంతోష గానము చేయుదము ॥రండి॥

2. మన ప్రభువే మహా దేవుండు - ఘన మహాత్మ్యము గల రాజు
భూమ్యగాధపు లోయలును భూధర శిఖరములాయనవే ॥రండి॥

3. సముద్రము సృష్టించె నాయనదే - సత్యుని హస్తమే - భువిఁ జేసెన్ =
ఆయన దైవము పాలితుల - మాయన మేపెడి గొఱ్ఱెలము ॥రండి॥

4.★ ఆ ప్రభు సన్నిధి మోకరించి - ఆయన ముందర మ్రొక్కుదము =
ఆయన మాటలు గైకొనిన - నయ్యవి మనకెంతో మేలగును ॥రండి॥

5. తండ్రి కుమార శుద్ధాత్మకును - దగు స్తుతి మహిమలు కల్గుగాక =
ఆదిని నిప్పుడు నెల్లప్పుడు నయినట్లు యుగముల నౌను ఆమేన్ ॥రండి॥

# అమ్మ స్మృతులతో...



ముఖ్యమంత్రిగా నేను ఎన్నో పుస్తకాలు ఆవిష్కరించాను గాని నా చెల్లి వ్రాసిన మా అమ్మ జీవిత చరిత్ర ఆవిష్కరించడం పూర్తిగా ఒక భిన్నమైన అనుభవం. నేను నా తమ్ముళ్ళు మరియు చెల్లెలితో కలిసి ఏక స్వరంతో చెప్పే విషయం ఏమిటంటే మేమంతా ఆమె పిల్లలమైనందుకు గర్వపడుచున్నాము.

మా అమ్మ మమ్ములనందరిని దైవమార్గంలో పెంచింది. బైబిలు చదువుకోవాలని, ఉదయం మరియు సాయంత్రం ప్రార్థన చేసుకోవాలని, క్రమంగా మందిరానికి వెళ్ళాలని నేర్పించింది. జీవితంలోని విలువలన్నీ మాకు బోధించింది. భక్తిగల మా అమ్మ పెంచడం వలన మేము క్రమశిక్షణ, కష్టపడి పనిచేసే స్వభావం, దీనత్వం, తోటి మానవుల పట్ల కనికరం, దాతృత్వం మరియు నాయకత్వ లక్షణాలు నేర్చుకున్నాము.



అమ్మ మాతో ఈ లోకంలో ఉన్నంత కాలం మేము ఆమె ప్రార్థనల మీద ఆధారపడినాము. నేను ముఖ్యమంత్రి కావాలని ఆమె ఎంతో ప్రార్థన చేసింది. నేను వేసవి ఎఱ్ఱని ఎండలో రాష్ట్రమంతటా పాదయాత్ర చేస్తున్నప్పుడు అమ్మ నా గురించి ఎంతో భారంతో ప్రార్థన చేసింది. ప్రభువు పాదసన్నిధిలో యింకా అమ్మ మా గురించి ప్రార్థన చేస్తూనే వుందని మా నమ్మకం.

ప్రభువు నుండి పాఠకులకందరికీ ఆశీర్వాదాలు కలగాలని మనసారా కోరుతున్నాను.

డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి
ముఖ్యమంత్రి
ఆంధ్రప్రదేశ్, ఇండియా.

# ఇందులో...


ముందుమాట

తొలిపలుకు

అమ్మను గురించి మా కుటుంబ సభ్యుల అభిప్రాయాలు

బాల్యము మరియు ఆత్మీయ జీవితం 1

ఆదర్శ స్త్రీ మూర్తిగా ఆమె పాత్ర 7

చివరి దినాలు 21

మూర్తీభవించిన పరిపూర్ణ మహిళ 25

సౌందర్యంపై దేవుని దృక్పథం గ్రహించుట 26

దేవుని స్వభావం ప్రతిబింబింపజేయుట 27

సమాధానపరచువారిగా వుండుట 29

దైవభక్తిని ఇతరులతో పంచుకొనుట 30

తన భర్తను ప్రేమించుట 32

తన పిల్లలను ప్రేమించుట 34

పవిత్ర జీవితం జీవించుట మరియు మంచి కార్యాలు చేయుట 36

ఆదర్శ గృహనిర్వాహకత్వం 40

శ్రీమతి జయమ్మ - ప్రార్థనా యోధురాలు 43

స్వయానికి ముగింపు దేవుని ప్రేమకు ఆరంభం 51

అమ్మ శ్రేష్ఠమైన ధననిధి "పరిశుద్ధ బైబిలు" 55

నివాళులు 59

శ్రీ ఎస్. ప్రభుదాసు రెడ్డి - గొప్ప ప్రార్థనాపరుడైన సువార్తికుడు 59

శ్రీమతి రాజమ్మ డేవిడ్ - అమ్మకు వదిన 62

శ్రీమతి ఎస్. కమలమ్మ - అమ్మకు చిన్న మరదలు 65

శ్రీమతి సరస్వతి రెడ్డి - అమ్మ స్నేహితురాలు 72

ఆచార్య వసంత్ జోసెఫ్ - అమ్మ చిన్ననాటి సోదర స్నేహితుడు 76

రెవ. ఎమ్. థియోఫిలస్ - డివిజనల్ అధ్యక్షులు (రిటైర్డ్) 79

శ్రీ ఎం. రామసుబ్బన్న - 16 సంవత్సరాలు అమ్మతో పరిచయం వున్న వ్యక్తి 82

యేసుక్రీస్తు దైవత్వం 88

# ముందుమాట



క్రీ.శ. 1946వ సంవత్సరంలో నా చిన్న అన్న శ్రీ వై. ఎస్. రాజారెడ్డి మా మేనత్త కుమార్తె జయమ్మను వివాహం చేసుకున్నాడు. ఆమె తన వివాహం అయిన తరువాత కూడ తన చదువును పులివెందులలో కొనసాగించి, ఎస్.ఎస్.ఎల్.సి. చివరి పరీక్షల్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణురాలైంది.

నా అన్న రోడ్లు మరియు భవనాల కాంట్రాక్టు పని, గనుల నిర్వహణబాధ్యతలతో పాటు రాజకీయాల్లో నిమగ్నమై వుండేవాడు. అయితే శ్రీమతి జయమ్మ, తన తల్లి సహాయంతో తన పిల్లల చదువు, వ్యవసాయం మరియు పని వారిని చూసుకునేది. ఆ విధంగా ఆదర్శమైన గృహిణిగా, అనేకులకు మాదిరిగా వుండేది. ఆమె కుటుంబం ఏ విధమైన సమస్యలు ఎదుర్కొన్నప్పటికీ, ఆమె క్షమాపణగురించి నొక్కి చెప్పేది, కీడుకు ప్రతిగా ప్రేమను నెలకొల్పేది.

ఆమె మంచి ఆతిథ్యమిచ్చే గృహిణిగా, స్త్రీల సహవాసంలో నాయకురాలిగా, లయన్స్ క్లబ్‌లో నిర్మాణాత్మక కార్యకలాపాల్లో పాలి భాగస్తురాలిగా, పంచాయితీ అధ్యక్షురాలిగా, వై. ఎస్. వైద్య ట్రస్టు సేవానిర్వాహకురాలిగా అనేక కార్యకలాపాల్లో పాల్గొని సమాజానికి సేవ చేసింది.

1995వ సంవత్సరంలో శ్రీమతి జయమ్మకు మెదడులో రక్తప్రసరణలోపం వచ్చిన కారణంగా న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) ఆసుపత్రికి తీసుకొని వెళ్ళారు. అప్పటి వైద్యము వలన శరీరం బలహీనపడినప్పటికీ, ఆమె విశ్వాసంలో బలపడింది. దేవుని పని చేయుటలో ఎంతో ఉత్సాహం కనపరచింది. అయితే, శ్రీమతి జయమ్మకు రెండవసారి వచ్చిన మెదడులో రక్తప్రసరణలోపం ఆమె మరణానికి కారణమైంది. ఇది ప్రభువు కార్యం. ఆయన తన సమయంలో తన కుమార్తెను తన మహిమలోకి పిలుచుకున్నాడు.

శ్రీమతి జయమ్మ అనుసరించిన బైబిలు వచనం, హెబ్రీయులకు 13:7 చదువరులు గ్రహించాలని నా దీన విన్నపం. **"మీకు దేవుని వాక్యము బోధించి, మీ పైని నాయకులుగా ఉన్నవారిని జ్ఞాపకము చేసికొని, వారి ప్రవర్తన ఫలమును శ్రద్ధగా తలంచుకొనుచు, వారి విశ్వాసమును అనుసరించుడి."**

శ్రీమతి జయమ్మ జీవితం మనందరికీ ఆదర్శం. **"నీతిమంతుని జ్ఞాపకము చేసుకొనుట ఆశీర్వాదకరం."** సామెతలు 10:7

డా. ఎస్. పురుషోత్తమ రెడ్డి, ఎం. ఎస్. డి. ఒ.
మాజీ శాసనసభ సభ్యులు, పులివెందుల

# తొలిపలుకులు

క్రైస్తవ్యం ఒక మతం కాదు. ఇది దేవునితో వ్యక్తిగత సంబంధమును నెలకొల్పే 'జీవ మార్గం'. లౌకిక రాజ్యమైన భారత దేశంలో అనేకమైన దేవుళ్ళు మరియు దేవతలు వున్నారని భావిస్తారు. దుష్టులను (పాపాత్ములను) శిక్షించుటకు నీతిమంతులను రక్షించుటకు వీరందరు ఈ భూమి మీదకు వచ్చారని చెప్పుతారు. అయితే యేసుక్రీస్తు పాపులను రక్షించుటకు ఈ లోకానికి అరుదెంచాడు. మన పాపముల నిమిత్తం సిలువ మీద తన ప్రాణాన్ని అర్పించాడు. బైబిల్లోని ఒక సుప్రసిద్ధ వాక్యభాగము దేవుని ప్రేమను గురించి యీలాగు తెలియజేస్తుంది : **"దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయకుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను"** (యోహాను 3:16).

దేవుడు మానవజాతి సృష్టికర్త కాబట్టి ఆయన మానవులందరికి తండ్రి. మనం మన పిల్లలను ప్రేమిస్తాం. లోక మాలిన్యము నుండి, బాధలనుండి వారిని కాపాడుటకు మనం చేయగలినదంతా చేస్తాం. వారు నశించిపోవాలని ఎన్నడూ కోరుకోం. ఇహలోక తల్లిదండ్రులైన మనం మన పిల్లల పట్ల అంత బాధ్యత కలిగి వుంటే, మన పరలోకపు తండ్రి మన గురించి ఎంతగా బాధ్యత కలిగి వుంటాడో మనం అర్థం చేసుకోవాలి. ఆయన మనలను రక్షించి తన కాపుదలతో భద్రపరిచే దేవుడు. ఏ ఒక్కరూ నశించిపోవాలని ఆయన కోరుకోవడం లేదు. బైబిలు బోధించే అద్భుతమైన సత్యమిది.

దేవుని హస్తాలకు మనం అప్పగించుకున్నప్పుడు, ఆయన మనలను సంపూర్ణంగా లక్ష్యపెడతాడు. మత్తయి సువార్త 6:33లో ఈ విధంగా వ్రాయబడింది. **"కాబట్టి మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి అప్పుడవన్నియు మీకనుగ్రహింపబడును."** 'అవన్నియు' అనే మాటలో సుగుణం, ఆరోగ్యం, ఐశ్వర్యం మరియు సంతోషం కలిసి వున్నాయి.

ఈ పుస్తకం అమ్మ యొక్క సంపూర్ణ జీవిత చరిత్ర కాదు కానీ ఆమెను గురించిన నా జ్ఞాపకాలు మరియు అనుభవాలు మీ అందరితో పంచుకొనుటకు ఎన్నుకొన్న మార్గం. ఆమె నిజమైన క్రైస్తవ జీవితం జీవించి అందరికీ సాక్షిగా నిలిచింది. ఆమె జీవిత విధానం, కుటుంబస్థులతోను బయటవారితోను ఆమెకున్న సంబంధబాంధవ్యాలు, అతి ప్రాముఖ్యంగా తన ప్రభువుతో ఆమె కలిగియున్న శాశ్వత సహవాసం అనే అంశాలను గ్రంథస్తం చేయడం ద్వారా నా హృదయపూర్వక నివాళిని నా తల్లికి సమర్పిస్తున్నాను. దేవుని ప్రేమను ఆమె అందరికీ సమానంగా పంచారు. ఆమె ఎడతెగని ప్రార్థనలు మా కుటుంబానికి కోటగా నిలిచాయి. ఆమె మాదిరికరమైన జీవితాన్ని బట్టి యేసుక్రీస్తును మేమందరము సొంత రక్షకునిగా అంగీకరించాము. ఆ కారణాన్ని బట్టే ఈ దినాన మేమెంతో ఆశీర్వదించబడ్డామని చెప్పగలను.

**"అత్యంత ప్రియమైన అమ్మ"** అనే పేరు ఈ పుస్తకానికి ఎందుకు ఎన్నుకున్నానంటే మాకు, మా పిల్లలకు మాత్రమే గాక ఆమెతో పరిచయమున్న ప్రతి ఒక్కరికి ఆమె ప్రియమైన వ్యక్తి. ఆమె మాతృత్వానికి నిజమైన మాదిరి. సర్వశక్తుడైన దేవునిచే ఆమె ఏ విధంగా వాడబడిందో తెలియజేయడానికి **"దేవుని బలిష్ఠమైన చేతిలో దీనపాత్ర"** అనే ఉపశీర్షికను కూడా ఈ పుస్తకానికి పెట్టాను.

మత్తయి 5:5లో యేసుక్రీస్తు ఈ మాటలు సెలవిచ్చాడు. **"సాత్వికులు ధన్యులు; వారు భూలోకమును స్వతంత్రించుకొందురు."** నేను ఈ వచనాన్ని చదివినప్పుడెల్లా నా మనసులో ఆమె ముఖం దర్శనమవుతుంది.

అనేకమందికి ప్రోత్సాహకరంగా వుండునట్లు ఈ పుస్తకం వ్రాయడానికి దేవుడు యిచ్చిన జ్ఞానాన్ని బట్టి, నడిపింపును బట్టి ఆయనకు లెక్కలేనన్ని వందనాలు చెల్లిస్తున్నాను. ఈ పుస్తకం వ్రాయుటలో మా కుటుంబ సభ్యులు అందించిన ప్రోత్సాహం, ప్రార్థనా సహకారముల నిమిత్తం వారందరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ పుస్తకం ముద్రణకావించబడి ప్రజలకు అందుబాటులోకి తెచ్చుటకు తోడ్పడిన కార్యనిర్వహక సభ్యులకు కూడ నా వందనాలు తెలియజేస్తున్నాను.

# అమ్మను గురించి
# మా కుటుంబ సభ్యులు చెప్పిన అభిప్రాయాలు

"నా భార్య మా యింటికి స్థంభము మరియు మా కుటుంబానికి ప్రార్థనా యోధురాలు"

– స్వర్గీయ వై. ఎస్. రాజారెడ్డి

"ఆమె నా తల్లి, అత్త కాదు"

– వై. ఎస్. భారతి జార్జి రెడ్డి

"నా విజయం వెనుక వున్న రహస్యం నా తల్లి, నా భార్య మరియు నా కుమార్తె చేసిన ప్రార్థనలే"

– వై.ఎస్. రాజశేఖర రెడ్డి

"ఆమె మానవ కోరికలకు అతీతం. తాను క్రీస్తుతో గడిపే తన నిత్య గృహం కొరకు ఆమె పరిపూర్ణంగా సిద్ధపడింది."

–వై. ఎస్. విజయలక్ష్మి రాజశేఖర్ రెడ్డి

"ప్రతి భోజనానికి ముందు దేవునికి వందనాలు చెల్లించాలని మరియు ఆహారం లేని పేదలకు దేవుడు ఆహారం దయచేయమని కోరాలని నా తల్లి నాకు నేర్పించింది."

– వై. ఎస్. వివేకానందరెడ్డి

"నా అత్తగారి నుండి క్షమాపణ మరియు దీనత్వము అను లక్షణాలు నేర్చుకున్నాను"

–వై. ఎస్. సౌభాగ్య వివేకానందరెడ్డి

"మేమందరం క్షేమంగా వుండుటకు మా పక్షంగా ఆమె ఎల్లప్పుడు దేవుణ్ణి వేడుకునేది. ఆమె లేని లోటు ఎవరూ మాకు తీర్చలేనిది"

-వై. ఎస్. సుధీకర్ రెడ్డి

"దీనత్వం ఆమె ప్రమాణచిహ్నం; ఆమె దీనత్వ జీవిత విధానం నేను యేసునందు నమ్మకముంచుటకు, ఆయన దీనత్వంలో పాలుపొందుటకు కారణమైంది"

-వై. ఎస్. విద్యాసుధీకర్ రెడ్డి

"క్రమశిక్షణ లక్షణాలు మరియు తోటిమానవుల పట్ల బాధ్యత కలిగి వుండటం నా తల్లి పెంపకంలో నాకు అలవడినాయి. గౌరవప్రదమైన తల్లులుగా వుండుటకు నిశ్చయంగా ఆమె వేలకొలది స్త్రీలను ప్రేరేపించి వుంటుంది"

-వై. ఎస్. రవీంద్రనాథ్ రెడ్డి

"నా అత్తగారి ప్రార్థనలు మాకు ఆశీర్వాదకరంగా మారాయి"

-వై. ఎస్. జయరవీంద్రనాథ్ రెడ్డి

"జేజి మాకు యేసుక్రీస్తును మరియు బైబిలును పరిచయం చేసింది. మా ఆత్మీయ ఎదుగుదల వెనుక ఆమె చేసిన ప్రార్థనలు వున్నాయి. ఇటువంటి మంచి భక్తి పునాది వేసిన జేజిని మేము ప్రేమిస్తున్నాం"

-మనుమలు, మనుమరాండ్రు,
సునీల్, జగన్, అనీత, రాగదీప్, విని మరియు సుమధుర్

"ఆమె ఎల్లప్పుడు బైబిల్లోని కథలు మాకు చెప్పుతూ వుండేది. ఆదివారపు బడి కొరకు మమ్మల్ని ఆలయానికి పంపేది, ప్రభువులో నన్ను పెంచడం విషయంలో ఆమె తన వంతు పాత్రను సమర్థవంతంగా నెరవేర్చారు. "

-షర్మిల (డా॥ వై. ఎస్. రాజశేఖర్ రెడ్డి గారి కుమార్తె)

"మా అందరి హృదయాల్లో జేజికి ప్రత్యేకమైన స్థానం వుంది. ఆమె సరైన విలువలు మాలో నింపింది. మా జీవితాల్లో వాటిని కొనసాగిస్తాం"

-సునీత (వై. ఎస్. వివేకానందరెడ్డి కుమార్తె)

"అమ్మమ్మ అద్భుతమైన మహిళ. దైవభక్తిలో ఏ మానవుడైనా చేరగలిగిన అత్యున్నత స్థాయికి ఆమె చేరుకుంది.

-దివ్య (బి. విమలారెడ్డి కుమార్తె)

"ఆమె మనుమడిగా పుట్టినందుకు నేనెంతో గర్వపడుచున్నాను"

- యువరాజ్ (బి. విమలా రెడ్డి కుమారుడు)

"నా ఆత్మీయ జ్ఞానం పెంపొందించుటలో ఆమె నాకు ఆత్మీయ గురువు మరియు అవసరతలో వున్న ప్రజల నిమిత్తం కనికరం చూపుట, సహాయపడుట ఆమె నాలో అలవర్చింది"

-శ్రవంతి (యువరాజ్ భార్య)



# బాల్యం మరియు ఆత్మీయ జీవితం

క్రీ. శ. 1930వ సంవత్సరం, జూలై నెలలో నా తల్లి జయమ్మ పులివెందులకు సమీపంలో వున్న **పెద్దకుడాల** గ్రామంలో జన్మించింది.

మా అమ్మమ్మ మరియమ్మకు కలిగిన సంతానంలో నా తల్లి మాత్రమే బ్రతికింది. మా తల్లి పసిప్రాయంలో వుండగానే మా తాత సుబ్బారెడ్డిగారు మరణించారు. మా అమ్మమ్మ మా తండ్రి బంధువు కాబట్టి ఆమె పెద్దమ్మ కుమారుడైన వెంకటరెడ్డి (మా తాత) దగ్గర వుండుటకు **బలపనూరు** గ్రామం వెళ్ళింది. తన కుమార్తె సంతోషంగా వుండాలని మా అమ్మమ్మ ఎంతో కష్టపడి పని చేసేది. బాల్యం నుండి క్రైస్తవ పాఠశాలల్లో చదివే అవకాశం మా అమ్మకు కలిగింది. ఆమె ఎస్.ఎస్.ఎల్.సి. చదువుచుండగా శ్రీ వై. ఎస్. రాజారెడ్డి గారితో వివాహమైంది. వివాహమైన తరువాత కూడ తన చదువు కొనసాగించి ఎస్.ఎస్.ఎల్.సి. పబ్లిక్ పరీక్షల్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణురాలైంది. తదుపరి ఆమెకు కుమారుడు జన్మించడం వలన అంతటితో చదువు ఆపివేసింది. ఆమె జేష్ఠకుమారుని పేరు వై. ఎస్. జార్జిరెడ్డి.



తన తల్లి మరియమ్మతో శ్రీమతి జయమ్మ

మా తాతగారు శ్రీ వై. ఎస్. వెంకటరెడ్డి ముందుగానే యేసుప్రభువును అంగీకరించాడు. తన పిల్లలందరికీ బాప్తిస్మం యిప్పించాడు. ఆ ప్రాంతంలో క్రీస్తును అంగీకరించిన వారిలో మా తాత మొదటి వ్యక్తి. అందువలన ఆయన ఎంతో శ్రమపడినాడు. ఎందుచేతనంటే ఆయన బంధువులు ఆయనను వెలివేసారు, ఆయన గ్రామమైన బలపనూరు నుండి ఆయనను పంపివేసారు. మా కుటుంబంలో దేవుని విత్తనం ప్రథమంగా వేసినవాడు మా తాత. ఇప్పుడు మేమంతా ఆయన ఆత్మీయ పంట కోస్తూ ఆనందిస్తున్నాం. నా తల్లి తొలి బాల్యదశ రెవ. సత్యా జోసఫ్ కుటుంబంతో గడిపింది.



రెవ. సత్య జోసఫ్

రెవ. వై. సత్యా జోసఫ్ జిల్లా క్రైస్తవ సంఘ సేవకుని పదవికి నియామకమైన మొదటి భారతీయుడు. ఈయన 1930వ సంవత్సరం నుండి 1946వ సంవత్సరం వరకు భారత దేశంలో తన పరిచర్యను పులివెందులలో జరిగించాడు. ఆ కాలంలోనే పులివెందుల ఊరిలో రెవ. వై. సత్యా

జోసఫ్ గారి ద్వారా సి.యస్.ఐ. ఆలయం నిర్మించబడింది. తరువాత 1996వ సంవత్సరంలో ఆలయ స్వర్ణోత్సవ సందర్భంగా ఆ మందిరానికి "యాడికి సత్యా జోసఫ్ జ్ఞాపకార్థ ఆలయం" అని నామకరణం చేయుటకు నా తల్లి చొరవ తీసుకుంది. ఇది తన ఆత్మీయ గురువుకు ఆమె యిచ్చిన బహుమానం.





పులివెందులలో సి.యస్.ఐ. దేవాలయము

మా తల్లి ప్రాథమిక విద్య పులివెందులలోని లండను మిషను పాఠశాలలో జరిగింది. ఈ పాఠశాలను రెవ. సత్యా జోసఫ్ మరియు మా తాత వెంకట రెడ్డి కలిసి నిర్మించారు. వీరు మంచి స్నేహితులు. మా అమ్మను మరియు మా అమ్మమ్మను వారి అవసరతలో, దుఃఖసమయంలో వారు ఎంతగానో ఆదరించారు. ఆయన పర్యవేక్షణలో మా తల్లి ఆత్మీయంగా ఎదగడం దేవుని ప్రణాళిక. రెవ. సత్యా జోసఫ్ మరియు ఆయన భార్యకు ఉన్న దైవభక్తి కారణంగా మా తల్లి బాల్యంలోనే క్రీస్తు వైపుకు ఆకర్షింపబడింది. ఈ దంపతులు మా తల్లికి ఆత్మీయ తల్లిదండ్రులు. బాల్యదశలో క్రీస్తుతో ప్రయాణించడం ప్రారంభించిన మా తల్లి ఎన్నడూ వెనుదిరగలేదు. మా తండ్రి వై.ఎస్. రాజారెడ్డి గారితో మా తల్లి వివాహం కుదుర్చుటలో రెవ. సత్యా జోసఫ్ ప్రాముఖ్యమైన పాత్ర వహించారు.



శ్రీమతి & శ్రీ వై. ఎస్. రాజారెడ్డి

మా తల్లి బాల్యదశ గురించిన సమచారం కొంత సేకరించుటకు నేను రెవ. సత్యా జోసఫ్ కుమారుడు శ్రీ వసంత్ జోసఫ్ దగ్గరకు వెళ్ళాను. ఆయన మా అమ్మ కంటె 3 సంవత్సరాలు చిన్నవాడు. మా తల్లి బాల్య దినాల్లో ఆలయ ఆవరణంలో ఆయనతో ఆటలు ఆడుకునేది. ఆయన మా తల్లిని తన పెద్దక్కగా భావించాడు. ఆమె మృదుభాషిణియని, ఎంతో మర్యాదగల బాలికగా వుండేదని, తనను ఎత్తుకొని తిరిగేదని చెప్పాడు. తమ బాల్య సంఘటనలు వివరించేటప్పుడు ఆయన ముఖము ఆనందంతో వెలిగిపోయింది. మా తల్లికి చివరి వరకు ఆయన మంచి స్నేహితునిగా వున్నాడు. ఆయన కాలు తీసివేయబడిన తరువాత పడకమీద ఉన్నప్పుడు మా తల్లి ఆయనను తరచుగా దర్శించడం నాకు జ్ఞాపకముంది. ఆమె ఎంతో బలహీనంగా వున్నప్పటికీ, ఆయనను చూడాలని కోరేది. మా అమ్మకు స్వంత అన్నదమ్ములు, అక్కచెల్లెండ్రు లేని కారణంగా ఆమె అతన్ని స్వంత తమ్మునిగా చూసింది.

తరువాత మా అమ్మ జమ్మలమడుగులో వున్న లండను మిషను బాలికల పాఠశాలకు వెళ్ళింది. అక్కడ నుండి ఆమె మద్రాసులోని బెంటిక్ పాఠశాలలో 8వ

తరగతి నుండి చదువుటకు మా అత్త రాజమ్మతో కలిసి వెళ్ళింది. అక్కడ కూడ మా అమ్మ ఆలయానికి క్రమంగా వెళ్ళేది. మా అత్త రాజమ్మ, మా అమ్మ ఒకే తరగతివారు. మా అమ్మ ఆ తరగతికి నాయకురాలిగా వుండేదని, మురికి వాడల్లో పాఠశాల చేపట్టిన సామాజిక సేవ చేయడంలో ఎంతో ఆసక్తి చూపేదని మా అత్త చెప్పింది. వారు పేద పిల్లలను చేరదీసి, వారికి స్నానం చేయించి, శుభ్రమైన బట్టలు తొడిగి వారికి క్రీస్తు గురించి చెప్పేవారు.



తన కుటుంబంతో

మా తల్లి మొదటి నుండి క్రైస్తవ పాఠశాలల్లో మాత్రమే చదువుట వలన యేసుక్రీస్తు గురించి తప్ప ఆమెకు ఏ ఇతర దేవుళ్ళు, దేవతల గురించి తెలియదు. **ప్రారంభం నుండి అంతం వరకు ఆమె యేసుక్రీస్తును ఎంతో నమ్మకంగా వెంబడించింది.** ఆమెకు మంచి క్రైస్తవ పునాది వుంది కాబట్టి తన గృహాన్ని

"నిత్యమూ వుండే బండ అయిన క్రీస్తు ప్రభువు" అను పునాది మీద కట్టుకుంది. **"వాన కురిసెను, వరదలు వచ్చెను, గాలి విసిరి ఆ యింటిమీద కొట్టెను గాని దాని పునాది బండమీద వేయబడెను గనుక అది పడలేదు"** (మత్తయి 7:25). ప్రారంభం నుండి ఆమె తన ఆత్మీయ గృహాన్ని క్రీస్తు అను బండ మీద కట్టుకున్నందుచేత తన జీవితంలో వచ్చిన అనేక వడిదుడుకుల్లో ఏ మాత్రం చలించలేదు. ఈ పుస్తకాన్ని చదువుచున్న పాఠకులందరూ ఆమె మాదిరిని అనుసరించాలని, తమ ఆత్మీయ గృహాలను క్రీస్తు అను బండ మీద కట్టుకోవాలని ఆశిస్తున్నాను.

# ఆదర్శ స్త్రీమూర్తిగా ఆమె పాత్ర

దేవుడు గొప్ప ఉన్నత ఉద్దేశంతో స్త్రీని సృజించాడు. పురుషునికి సాటియైన సహాయం అవసరమని, అతని జీవితంలోని ప్రతి అడుగులో స్త్రీ సహకారం అవసరమని ఆయన తలంచాడు. దేవుని ఉద్దేశ ప్రకారం ఒక స్త్రీ జీవించినప్పుడు, ఆమె జీవితం సంతోషంగా వుంటుంది. అదే సమయంలో దేవుని మహిమపరచుటలో ఇతరులకు మాదిరిగా వుంటుంది. ఆమె మంచి భార్యగా వున్నప్పుడు, ఆమె తన భర్తకు కిరీటంగా వుంటుంది. ఆమె బాధ్యతగల తల్లిగా వున్నప్పుడు, ఆమె సమాజానికి మంచి పిల్లలను అందిస్తుంది. ఆ విధంగా ఈ ప్రపంచాన్ని యోగ్యమైన నివాస స్థలంగా చేస్తుంది. మా అమ్మ మంచి భార్య, మంచి తల్లి. ఆమె దీనత్వంతో దైవభక్తి కలిగి జీవించింది. **దేవుని భయము మరియు నీతి ఆమె ఆభరణాలు.** ఆమె భక్తిగా జీవించడం వలన ఆమె కుటుంబానికి ఆశీర్వాదకరంగా మారింది. తద్వారా ఆమె జీవితంలోని ప్రతి అడుగులో దేవుణ్ణి మహిమపరచింది. ఈ ప్రపంచంలోని స్త్రీలందరు అనుసరించగల మాదిరితో కూడిన

జీవితం నా తల్లి కొనసాగించింది. **"జ్ఞానవంతురాలు తన యిల్లు కట్టును మూఢురాలు తన చేతులతో తన యిల్లు ఊడబెరుకును"** సామెతలు 14:1.

మా అమ్మ పెద్ద ఉమ్మడి కుటుంబంలో కాపురం చేసింది. ఆమె తల్లి సహాయంతో ఆ కుటుంబంలోని వారందర్నీ సంతోషపరచుటకు ప్రయత్నించింది. ఆమె ప్రతి ఒక్కరితో సఖ్యతగా వుండేది. అందువలన పెద్దవారు మొదలుకొని చిన్నవారి వరకు అందరు ఆమెను ఎంతగానో ప్రేమించారు. ఆమె ఎవరితోను ఎన్నడు వాదం పెట్టుకోలేదు. ఎల్లప్పుడు సంతోషంగా వుండేది. కుటుంబంలోని వారందరి బాగోగులు తానే స్వయంగా చూసేది. నా తల్లిదండ్రులకు రెండవ కుమారుడు వై. ఎస్. రాజశేఖర్ రెడ్డి జన్మించినప్పుడు, పిల్లలందరు వారి స్వంత గృహాల్లో వున్నట్లయితే, ఎంతో సుఖంగా వుంటారని మా తాత తలంచాడు. అందునుబట్టి వారిలో ప్రతి ఒక్కరికి ఒక్కొక్క యిల్లు కట్టించి, వారి వారి కుటుంబాలు నివసించుటకు వారి వారి గృహాలకు పంపివేసాడు.

ఆ కాలంలో మా తల్లి వయసులో చిన్నదైనప్పటికీ మా అమ్మమ్మ సహాయంతో గృహాన్ని, పిల్లలను ఎంతో నైపుణ్యంతో చూసుకుంది. తరువాత మూడవ కుమారుడు జన్మించాడు. అతనికి వివేకానందరెడ్డి అని పేరు పెట్టారు. నేను మా అమ్మకు నాల్గవ సంతానం. ఆమెకు ఆడపిల్లలు అంటే చాల యిష్టం. నాకు తోడుగా మరొక ఆడపిల్ల వుంటే బాగుంటుందని రెండు కాన్పులు ప్రయత్నించింది. అయితే ఆమెకు యింకా యిద్దరు కుమారులను యివ్వాలని దేవుని చిత్తమై వుంది. వారికి సుధీకర్ రెడ్డి మరియు రవీంద్రనాథ రెడ్డి అని పేర్లు పెట్టారు.

దేవునియందు ఆమెకు వున్న ప్రగాఢ నమ్మకంతో ఆమె తన పిల్లలను పెంచుటలో బైబిలు నియమాలు పాటించింది. సామెతలు 22:6లో ఈ విధంగా వ్రాయబడి వుంది. **"బాలుడు నడువవలసిన త్రోవను వానికి నేర్పుము వాడు పెద్దవాడైనప్పుడు దానినుండి తొలగిపోడు."** కనుక ఆమె మమ్ములను చదివించింది, ప్రోత్సాహపరిచింది. అన్నిటికీ మించి క్రీస్తు వైపుకు నడిపించి, మా విశ్వాసమును దేవుని వాక్యముపై ఉంచులాగున మమ్మును పెంచింది.



1974లో భర్త, తల్లి, పిల్లలు, మనుమలతో శ్రీమతి జయమ్మ

మా తల్లి అనుదినం మేము బైబిలు చదవాలని, ప్రతి ఆదివారం ఆలయానికి వెళ్ళాలని, క్రమంగా జరిగే కుటుంబ ప్రార్థనలకు రావాలని ఎంతో ఖచ్చితంగా నొక్కి చెప్పేది. ఈ విషయాల్లో మేమందరం మా తల్లికి భయపడేవారం. ఎన్నడూ మేము ఆమెను నిరాశపరచలేదు. మా తండ్రి సహితం ఆమె దైవభక్తికి భయపడేవారు. ఆమెను ఎన్నడూ నిరాశపరచకుండుటకు తన శాయశక్తులా ప్రయత్నించేవారు.

పేదరికం రూపుమాపాలని, పట్టణంలోని యౌవనస్తులను క్రమశిక్షణలో పెట్టాలని మరియు తన కుమారుడు ముఖ్యమంత్రి కావడం చూడాలని నా తండ్రి కలలు కన్నాడు. ఆ కలలు నెరవేరుటకు ప్రతీసారి మా అమ్మ ఆయనను ప్రోత్సాహించేది, ఎంతగానో ప్రార్థించేది **"విస్తారమైన మాటలలో దోషముండక మానదు తన పెదవులను మూసికొనువాడు బుద్ధిమంతుడు"** సామెతలు 10:19 అను వచనాన్ని మా అమ్మ నమ్మింది. దేవుని వాక్యం ప్రకటించే విషయంలో తప్ప ఆమె ఎక్కువ మాట్లాడేది కాదు.

ఆ రోజుల్లో ప్రజలు కుల వ్యవస్థ గురించి ఎంతో పట్టింపుతో వుండేవారు. మాకందరికీ జీవిత భాగస్వాములను వెదకవలసి వచ్చినప్పుడు, ఎంతో కష్టంగా వుండేది. ఎందుచేతనంటే అప్పుడు యేసుప్రభువును నమ్మిన రెడ్డి కులస్థులు ఎక్కువగా లేరు. వివాహం క్రైస్తవ పద్ధతిలో జరగాలని మా తల్లి ఎంతో పట్టుదలతో వుండేది. క్రైస్తవులే తనకు కోడళ్ళుగా రావాలని ఆమె కోరింది. అయితే కోడళ్ళందరు మరియు అల్లుడు హిందువులుగా వున్నప్పటికీ వివాహ సమయంలో వారు క్రైస్తవులైనారు.

ఆలయానికి, లేక కుటుంబ ప్రార్థనలకు హాజరు కావాలని ఏ కోడలిని ఆమె ఎన్నడూ బలవంతం చేయలేదు. అయితే వారు యేసుక్రీస్తును తెలుసుకోవాలని ఎల్లప్పుడు దేవునికి ప్రార్థన చేసేది. **ఆమె ప్రేమను బట్టి, ప్రార్థనలబట్టి వారందరు క్రమంగా మారిపోయారు.** ప్రస్తుతం వారందరు భక్తిగల క్రైస్తవులు. మా తల్లి మమ్ములను పెంచిన విధంగా వారందరు తమ పిల్లలను పెంచారు. మనుమలు, మనుమరాండ్రందరు ఆమెను ఎంతగానో ప్రేమించారు.



మనుమలు మరియు మనుమరాండ్రతో శ్రీమతి జయమ్మ



శ్రీమతి జయమ్మ కుమారులు మరియు కోడళ్లు

నా వదినలు మరియు మరదళ్ళు వారి తల్లుల కంటె మా తల్లిని ఎక్కువగా ప్రేమించారు. ఆమె ప్రేమ మరియు దీనత్వం గురించి చెప్పడానికి అనేక సంఘటనలు వారి దగ్గర వున్నాయి. ఆమె నిరంతర ప్రార్థనలతో వారినందర్నీ క్రీస్తు చెంతకు నడిపించింది. ఆమె వారందరికీ మాదిరి. నేను ఆమెకు ఏకైక కుమార్తెను అయినప్పటికీ నాకు వారికి మధ్య ఎన్నడు తేడా చూపేది కాదు. ఏదైనా ప్రార్థనా

కూడికలకు లేక ఉత్సవాలకు మా బంధువులను లేక సంఘకాపరులను ఆహ్వానించాలని ఆమె అనుకున్నప్పుడు వ్యక్తిగతంగా వారి గృహాలకు వెళ్ళి, వారిని ఆహ్వానించేది. ఇంకొకరైతే వారిని ఫోను ద్వారా ఆహ్వానిస్తారు. **అది ఆమె దీనత్వానికి గుర్తు.** ఆమె దీనత్వం ద్వారా మేము ఎంతో నేర్చుకున్నాం. సంతోషమైనా లేక విచారమైనా ఆమె చూపే నిగ్రహానికి మేమెంతో ఆశ్చర్యపడేవారము. ప్రతి విషయానికి ఆమె ప్రభువు మీద ఆధారపడేది కాబట్టి ఆ విధంగా వుండేది.

ఆమె ఎన్నడు తన కొరకు బట్టలు కొనుక్కునేది కాదు. ఆమె ధరించుకొనుటకు కోడళ్ళందరు ఆమెకు చీరలు కొని తెచ్చేవారు. ఆమెకు ఎటువంటి ప్రత్యేకమైన యిష్టాయిష్టాలు లేవు. ఆమె సామాన్యమైన తేలికపాటి చీరలు మాత్రం ధరించేది. తన కొరకు ప్రత్యేకంగా అది కావాలి యిది కావాలి అనే కోరికలు ఆమెకు లేవు కాబట్టి ఆమెకు ఏమైనా బహుమానాలు కొనడం చాల కష్టంగా వుండేది. మేమందరం దైవభక్తికి సంబంధించిన కొన్ని చిన్న పుస్తకాలు ఆమె కొరకు కొనేవారం. ఇంకా రకరకాల సైజుల్లో సిలువలు, దేవుని వాక్యం వుండే అలంకార వస్తువులు కొనేవారం.

నా పిల్లలు యువరాజ్ మరియు దివ్య మొదటి మూడు సంవత్సరాలు మరియు పాఠశాల సెలవులు ఆమెతో గడిపారు. అప్పుడు ఆమె ప్రభావం వారి మీద గొప్పగా పడింది. పడుకునేటప్పుడు ఆమె చెప్పిన బైబిలు కథలన్నీ యింకా జ్ఞాపకం వస్తున్నాయని యువరాజ్ నాకు చెప్పుతుంటాడు. యువరాజ్ కుమారుడు దేవరాజ్ సహితం ఆమెను ఎంతో ప్రేమించాడు.



నా పిల్లలు దివ్య మరియు యువరాజ్‌తో శ్రీమతి జయమ్మ

మా అమ్మ మమ్మును విడిచి పరలోకం వెళ్ళినప్పుడు దేవరాజ్‌కు వయసు 4 సంవత్సరాలు మాత్రమే. "ఆమె కాళ్ళు పట్టుకొని, నేను కూడ అవ్వతో (నా తల్లితో) దేవుని దగ్గరకు వెళ్ళి వుండవలసింది" అని పదే పదే చెప్పేవాడు. దేవరాజ్‌కు ఆమె లేని లోటు తీరనిది. ఆ రకమైన ప్రేమ ఆమె పంచింది, తిరిగి పొందుకుంది. మా తల్లి తనకు "ఆత్మీయ మార్గదర్శి" అని నా కోడలు శ్రవంతి చెపుతూవుంటుంది. ఆమె మా అమ్మ దగ్గర నుండి ఎన్నో మంచి విషయాలు నేర్చుకుంది. పిల్లలు, మనుమలు మరియు మనుమరాండ్రందరు మా అమ్మ స్వార్థంలేని వ్యక్తి అని గుర్తించారు, ఆమె చుట్టూ వున్న ప్రజల బాగోగులు గురించి ఎల్లప్పుడు ఆలోచించేదని భావించారు.



నా మనుమడు దేవరాజ్‌తో శ్రీమతి జయమ్మ

యిల్లు విడిచి పనులకు బయటకు వెళ్ళబోయే ముందు ఆమె దగ్గరకు వెళ్ళి ప్రార్థన చేయించుకునే అలవాటు కుటుంబ సభ్యులందరికీ వుంది. నా తండ్రి ఎన్నో ప్రయాణాలు చేసేవారు. ఆయన ఎన్నడు కూడ ఆమె ప్రార్థనలను నిర్లక్ష్యం చేయలేదు. ముఖ్యమంత్రి అయిన మా అన్న సహితం తన జీవితంలో ఏదైనా ప్రాముఖ్య కార్యం చేయుటకు ముందు తాను ఎంత పని తొందరలో వున్నప్పటికీ ప్రార్థన చేయించుకొనుటకు మా అమ్మ దగ్గరకు వెళ్ళేవాడు.



ప్రార్థన చేయించుకొనుటకు అమ్మ దగ్గరకు వచ్చిన రాజశేఖరన్న

అమెరికాలో వున్న నా కుమార్తె దివ్య, ఏదైనా సమస్య లేదా విచారంలో ఉన్నప్పుడు, ఆనందం కలిగినప్పుడు అనేకసార్లు ఫోనులో నా తల్లిచే ప్రార్థనలు చేయించుకునేది. గురివి రెడ్డి వంటి మా తండ్రి స్నేహితులు సహితం ఏదైనా ఒక ప్రాముఖ్యమైన పనికి వెళ్ళబోయే ముందు మా తల్లి దగ్గరకు వచ్చి ప్రార్థన చేయించుకునేవారు. మేమంతా ఆమె ప్రార్థనల మీద ఆధారపడేవారం. దేవుడు ఆమె ప్రార్థనలు తక్షణమే వింటాడని మా నమ్మకం. అయితే మేమందరం ఆమె వలె

ప్రార్థనా యోధులుగా మారాలని ఆమె కోరేది. ఆమె మమ్మును విడిచి వెళ్ళిన తరువాత మాత్రమే ఆమె కోరికలోని గొప్పతనం గ్రహించగలిగాను. ఇప్పుడు ఈ మార్పుతో ఆమె నన్ను చూసినట్లయితే ఎంతో సంతోషించేది. ఎందుచేతనంటే ఇతరుల గురించి ప్రార్థించాలనే ఆమె భారం నేను స్వీకరించాను. ఏలీయా ఆత్మ ఎలీషా మీదకు దిగినట్లుగా, మా తల్లి ప్రార్థనా భారం నాకు వచ్చింది. పరిశుద్ధాత్మతో నేను నింపబడుటకు ప్రభుని పాదాల చెంత మా తల్లి ప్రార్థిస్తూ వుంటుందని నా నమ్మకం. నేను ప్రభువునందు సంతోషం కనుగొన్నాను. దేవుని కృప మా మీద వుంది. దేవుని రాజ్యం కొరకు పని చేయుటలో నా పిల్లలు మరియు నేను గొప్ప ఆనందం కనుగొన్నాము. గణపవరంలో నా కుమారుడు యువరాజ్, నా తల్లి జ్ఞాపకార్థం (వై. ఎస్. జయమ్మ మెమోరియల్ చర్చి) ఆలయం కట్టించాడు. ఇప్పుడు అక్కడ అనేకమంది దేవుని దగ్గరకు నడిపించబడుతున్నారు.



శ్రీమతి జయమ్మ జ్ఞాపకార్థ ఆలయం, శిలాఫలకం, గణపవరం

"యెహోవా దృష్టి నీతిమంతుల మీద నున్నది. ఆయన చెవులు వారి మొరలకు ఒగ్గియున్నవి" (కీర్తన 34:15).

మా తల్లి మా కుటుంబం గురించి మరియు ఇతరుల గురించి ఎంతో సమయం ప్రార్థనలో గడిపేది. అయితే ఒకసారి మాత్రం మేము, మా గ్రామ ప్రజలందరు ఆమె గురించి ప్రార్థించే అవకాశం కలిగింది. 1995వ సంవత్సరంలో ఆమె తీవ్రంగా జబ్బు పడింది. అప్పుడు ఆమెకు శస్త్రచికిత్స జరిగింది. ఆ సమయంలో ఆమె బాత్‌రూములో పడిపోయి తలకు గట్టిదెబ్బ తగలడం వలన స్పృహలేని స్థితిలోకి వెళ్ళిపోయింది. అప్పుడు దేవుని కృపను బట్టి మా మూడవ అన్న వై. ఎస్. వివేకానందరెడ్డి ఇంట్లోనే వున్నాడు. ఆయన వెంటనే మా తల్లిని హైదరాబాదుకు తీసుకొని వెళ్లాడు. హైదరాబాదులోని వైద్యులు ఆమెకు వైద్యం చేయలేకపోయారు. అక్కడ నుండి వెంటనే ఢిల్లీలోని ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) ఆసుపత్రికి తీసుకొని వెళ్ళవలసి వచ్చింది. ఆ రోజుల్లో ఆ ఆసుపత్రిలో చేర్చడం చాల కష్టంగా ఉండేది. అయినప్పటికీ ప్రభువు కృపను బట్టి మా రెండవ అన్న వై. ఎస్. రాజశేఖర్ రెడ్డి ఆ సమయంలో పార్లమెంటు సభ్యుడు కాబట్టి తన పలుకుబడితో మా తల్లిని వెంటనే ఆ ఆసుపత్రిలో చేర్చగలిగాడు. అక్కడ వైద్యులు మా తల్లికి శస్త్రచికిత్స చేయాలని తీర్మానించారు. ఆసుపత్రిలో మా తండ్రితో వున్న మా తమ్ముడు సుధీకర్ రెడ్డి, ఆ రాత్రి శస్త్ర చికిత్స చేయుటకు ముందు వైద్యులు ఏ విధంగా వెనుకాడారో నాకు చెప్పాడు. అప్పుడు వైద్యులకు సహితం మా తల్లి బ్రతుకుతుందన్న నమ్మకం ఏ మాత్రం లేకుండ వున్నారు. ఆమె నాడి కదలికలో మరియు రక్తప్రసరణలో హెచ్చుతగ్గులు అధికంగా వున్నాయి. వైద్యం చేయుటకు ఆమె చాలా బలహీనంగా వుందని వైద్యులు చెప్పారు.

ఎంతో గుండె ధైర్యం మరియు బలం గల మా తండ్రి సహితం అప్పుడు ఏడవడం ప్రారంభించాడు. మా ఎడతెగని ప్రార్థనల వలన, మా విశ్వాసము వలన శస్త్రచికిత్స నిర్ణయించిన సమయానికి కొన్ని గంటలకు ముందే ఆమె పరిస్థితి కుదుటపడింది. అప్పుడు వైద్యులు శస్త్రచికిత్స చేయడానికి ముందుకు వెళ్ళగలిగారు. శస్త్రచికిత్స అయిన తరువాత క్లిష్టమైన రోజుల్లో మా గ్రామంలోని క్రైస్తవులందరు మోకాళ్ళ మీద వుండి ఆమె కొరకు ప్రార్థించారు. అది గొప్ప అద్భుతం. ఈ సంఘటన ద్వారా దేవుడు తన మహిమార్థం మా తల్లిని వాడుకున్నాడు. శస్త్రచికిత్స తరువాత దేవుని కృపనుబట్టి మాత్రమే ఆమె ఆరోగ్యవంతురాలైంది.



వివాహానికి వెళ్ళినప్పుడు సహితం అమ్మ బైబిలు తీసుకొని వెళ్ళేది

అమ్మ తన జీవితంలోని ప్రతి అడుగులో యేసుక్రీస్తు ప్రభువును మహిమపరచింది. మా తండ్రి చంపబడిన తరువాత, ఆమె శరీర ఆరోగ్యం క్రమంగా క్షీణించిపోయింది గాని రోజు వెంబడి రోజు ఆమె ఆత్మీయంగా బలపడింది. ఆమె తన భర్తను చంపిన హంతకులను క్షమించింది. వారు శిక్ష పొందుటకు దేవుని హస్తాలకే వారిని అప్పగించింది. "నీ శత్రువును క్షమించు" అని, "పగ తీర్చుట నా పని" అని దేవుడు తన వాక్యంలో చెప్పిన మాటలను ఆమె నమ్మింది. ఆమె భక్తి జీవితం అంత గొప్పది.

"శ్రేష్ఠమైన జీవిత విధానం బైబిలును శ్రేష్ఠంగా చదువుట వలన వస్తుంది." మా అమ్మ తన పరలోకపు నివాసానికి వెళ్ళినప్పుడు నా కుమారుడు ఆమె బైబిలును తన దగ్గర భద్రపరచుకోవాలని కోరాడు. అది మా తల్లికి ఎంతో విలువైన సంపదగా వుండేది. ఆమె బైబిలు పాతగిలి ఉంది, దానిలో చిరిగిపోయి మరల అతికించబడిన పేజీలు చాలా వున్నాయి. మా అమ్మ ఎల్లప్పుడు చదివిన గ్రంథం అది. అందులో చాలా లేఖన భాగాలకు పెన్ను గుర్తులు వున్నాయి.



అమ్మ బైబిలు

**"ప్రభువు దృష్టికి మిమ్మును మీరు తగ్గించుకొనుడి, అప్పుడాయన మిమ్మును హెచ్చించును"** యాకోబు 4:10. "యెహోవా నిన్ను తలగా నియమించునుగాని తోకగా నియమింపడు. నీవు పైవాడవుగా ఉందువుగాని క్రింది వాడవుగా ఉండవు" ద్వితీయోపదేశకాండము 28:13,14. ఈ వచనాలు నా తల్లి జీవితంలో నెరవేరాయి. ఆమె సాధారణమైన కాంట్రాక్టరు భార్య స్థాయి నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి తల్లి స్థాయి వరకు ఎదిగింది. ఆమె ఎల్లప్పుడు దీనురాలైన తల్లిగానే వుంది. **ఆమె మరణం వరకు ఎంతో దీనురాలిగా వుంది కాబట్టి దేవుడు ఆమెను ఎంతో ఉన్నతంగా ఆశీర్వదించాడు.**

యాకోబు 2:17 ప్రకారం, **"క్రియలు లేని విశ్వాసము మృతము."** మా తల్లి ఈ వాక్యాన్ని నమ్మింది. అందుచేత ప్రజలకు సహాయం చేయుటలో, పేదవారి ఆకలి తీర్చుటలో, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించుటలో, స్వచ్ఛంద సంస్థల సేవా కార్యక్రమాలలో ఆమె ఎప్పుడూ నిమగ్నమై వుండేది. నేను వచ్చినప్పుడు ఇంట్లో వుంటాననంటేనే నేను పులివెందులకు వస్తానని మా అమ్మతో చెప్పుతూ వుండేదాన్ని. ఇప్పుడు ఆ మాటలు జ్ఞాపకం వచ్చినప్పుడు నేనెంత స్వార్థపరురాలనో గ్రహించాను.



స్త్రీల అభ్యుదయ సదస్సులో అమ్మ

**మా తల్లి దేవుని రాజ్యం కట్టుటలో చాల వరకు తన ధనవనరులను ఖర్చు చేసింది.** దేవుని సేవకులకు సహాయం చేయుటలో ఆమె ఎన్నడూ వెనుకాడేది కాదు. ఎంతోమంది దైవసేవకులు ఆమెను దర్శించి, కుటుంబం కొరకు ప్రార్థించినప్పుడు ఆమె వారిని సత్కరించేది. ఆలయాలు నిర్మించుటకు మరియు పేద సంఘకాపరులకు సహాయం చేయుటకు నా తండ్రికి సిఫారసు చేసేది. **"సంతుష్టి సహితమైన దైవభక్తి గొప్పలాభసాధనమై యున్నది. మనమీలోకములోనికి ఏమియు తేలేదు, దీనిలోనుండి ఏమియు తీసికొని పోలేము. కాగా అన్నవస్త్రములు గలవారమై**

**యుండి వాటితో తృప్తిపొందియుందము"** 1 తిమోతి 6:6-8. **"ఎందుకనగా ధనాపేక్ష సమస్తమైన కీడులకు మూలము"** 1 తిమోతి 6:10. మా తల్లి ఈ మాటలు హృదయపూర్వకంగా నమ్మింది, వాటికి అనుగుణంగానే జీవించింది. ఈ కారణం చేత ధనం కూడగట్టుకోవాలనే తలంపు ఆమెకు ఎన్నడూ లేదు. ఆమె కోటీశ్వరుని భార్య మరియు ముఖ్యమంత్రి తల్లి అయినప్పటికీ అతి పరిమితమైన ఆభరణాలతో నిరాడంబరమైన వస్త్రాలను ధరించేది. అంతకంటె ఎక్కువగా ఆమె కోరలేదు. ఆమె ఎల్లప్పుడు దేవుని ప్రజలకు యిచ్చుటలో మరియు పేదవారికి సహాయం చేయుటలో తన ధనాన్ని ఖర్చు చేసింది.

# చివరి దినాలు

క్రీర్తన 82:7లో ఈ విధంగా చదువుతాం. **"అయినను ఇతర మనుష్యులు చనిపోవునట్లు మీరును చనిపోవుదురు. అధికారులలో ఒకడు కూలునట్లు మీరును కూలుదురు."** ఇతరులు మరణించినట్లే క్రైస్తవ విశ్వాసి కూడా మరణిస్తాడు. రోగం వలన లేక ప్రమాదం వలన లేక యింకా ఏదైనా కారణం వలన మరణించవచ్చు. అయితే క్రైస్తవ విశ్వాసి మరణంలో వున్న తేడా ఏమంటే **వారు మరణసమయంలో కూడ దేవుని మహిమపరుస్తారు.**

మా తల్లి మరణం గొప్ప అరుదైన సంఘటన. 1995వ సంవత్సరంలో జరిగినట్లే 2006వ సంవత్సరంలో బాత్‌రూములో పడిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్ళిపోయింది. వెంటనే వైద్యం నిమిత్తం హైదరాబాదు తీసుకొని వెళ్ళి అపోలో ఆసుపత్రిలో చేర్చాము. అప్పుడు మా అన్న డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి కాంగ్రెసు పార్టీ సర్వసభ్యుల సమావేశ (ప్లీనరీ) కార్యక్రమాలతో తలమునకలై వున్నారు. ఆయనకు తీరిక లేని పనులు వున్నప్పటికీ అమ్మను చూచుకొనుటకు

ప్రాముఖ్యతనిచ్చి, అనేకమార్లు ఆసుపత్రికి వచ్చి ఆమెను దర్శించారు. అప్పుడు ముఖ్యమంత్రి భార్య శ్రీమతి విజయలక్ష్మి ఆసుపత్రిలో ప్రార్థనలు నిర్వహించింది. అపోలో ఆసుపత్రి చరిత్రలో అటువంటి విశ్వాస ప్రార్థనలు ప్రజలు ఎన్నడూ చూడలేదు. హైదరాబాదులోని అపోలో ఆసుపత్రిలో కోమాలో వున్న మా తల్లి కోలుకొనుటకు ఆంధ్రప్రదేశ్ అంతటా అనేకులు ప్రార్థనలు చేసారు.

అప్పుడు దేవుడు ప్రతి ఒక్కరికీ సహాయం చేసాడు. ఆమె అనారోగ్యం కాంగ్రెసు సర్వసభ్యుల సమావేశానికి ఏ విధమైన ఆటంకం కాలేదు. శ్రీమతి సోనియా గాంధీ, ప్రధానమంత్రి డా॥ మన్మోహన్ సింగ్ వంటి ప్రముఖులు మా అమ్మను చూచుటకు ఆసుపత్రిని దర్శించారు. ఆమె అనారోగ్య పరిస్థితి గురించి ఎప్పటికప్పుడు తెలుసుకునేవారు. వ్యాధి ప్రారంభం నుండి ఆమె మరణించిన తరువాత జరిగిన సమాధి కార్యక్రమం వరకు అన్ని పరిస్థితుల్లో యేసుక్రీస్తు ప్రభువు మహిమపరచబడినాడు. దుఃఖకరమైన ఆమె మరణవార్త వార్తాపత్రికలన్నిటిలో ప్రచురించబడింది. ఆమె భూస్థాపన కార్యక్రమం టెలివిజను ఛానల్స్ అన్నింటిలో



శ్రీమతి జయమ్మ మృత దేహాన్ని చూచుటకు వచ్చిన
అప్పటి రాష్ట్ర గవర్నరు సుశీల్ కుమార్ షిండే

ఆంధ్రప్రదేశ్ అంతట ప్రత్యక్ష ప్రసారం చేయబడింది. యేసుక్రీస్తు ఎంతగానో మహిమపరచబడినాడు.

మా అమ్మను 25వ తేది జనవరి 2006న సాయంత్రం గం॥ 4-42 నిముషాలకు ఆమె 75 ఏళ్ల ప్రాయంలో దేవుడు తన యొద్దకు పిలుచుకున్నాడు. ఆ మరుసటి రోజు అనగా 26-1-2006న మధ్యాహ్నం గం॥ 12-30 ని॥లకు మా తండ్రి గారైన శ్రీ రాజారెడ్డి గారి సమాధి ప్రక్కనే ఆమె భూస్థాపన జరిగింది. విడిచిపెట్టబడిన కుటుంబాన్ని అనేక మంది బిషప్‌లు, పాస్టర్లు, సువార్తికులు దర్శించి దేవుని వాక్యంతో ఆదరించారు.

ఆమె పరలోక గృహానికి చేరినప్పుడు, **"భళా నమ్మకమైన దాసురాలా!"** అని దేవుడు ఆమెను అభినందించి వుంటాడు. ఆమె తన జీవితంలో దేవుడిని ఘనపరచింది కాబట్టి ఆమె పిల్లలు గొప్పగా ఆశీర్వదించబడినారు.

**"మంచి పోరాటము పోరాడితిని, నా పరుగు కడ ముట్టించితిని, విశ్వాసము కాపాడుకొంటిని"** 2 తిమోతి 4:7.

# ప్రధానమంత్రి సంతాప సందేశం



జనవరి 26, 2005
న్యూఢిల్లీ

గౌ॥ ప్రధానమంత్రి డా॥ మన్మోహన్ సింగ్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డా॥ వై. ఎస్. రాజశేఖర్ రెడ్డి గారి తల్లి శ్రీమతి వై. ఎస్. జయమ్మ మృతి పట్ల సంతాపం తెలియజేసారు. "మీ తల్లి శ్రీమతి వై. ఎస్. జయమ్మ మృతి పట్ల నేను చాల వ్యధ చెందాను. ఈ వ్యక్తిగత దుఃఖసమయంలో మీకు మరియు మీ కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేయుచున్నాను. ఆమె ఆత్మకు శాంతి కలగాలని నేను ప్రార్థిస్తున్నాను".

# మూర్తీభవించిన పరిపూర్ణ మహిళ

ఈ మధ్య, ఎ. గేట్స్ మరియు ఎలయిన్ వ్రాసిన 'ది మెజర్ ఆఫ్ వుమెన్' (స్త్రీ యొక్క కొలత) అనే పుస్తకాన్ని చదువుతూ వున్నాను. మార్గనిర్దేశిగా ఉండుటకు అవసరమైన 8 ప్రాముఖ్య అంశాలు ఈ పుస్తకంలో ప్రస్తావించారు. మా తల్లిలో ఈ లక్షణాలన్నీ నేను గుర్తించినప్పుడు నమ్మలేకపోయాను మరియు ఆశ్చర్యపోయాను. మా అమ్మ గుణలక్షణాలకు ఈ లక్షణాలు ఏ విధంగా సరిపోతాయో ఒక దాని తరువాత మరొకటి వీటన్నిటిని వివరిస్తాను.

1. సౌందర్యంపై దేవుని దృక్పథం గ్రహించుట
2. దేవుని స్వభావం ప్రతిబింబింపజేయుట
3. సమాధానపరచువారిగా వుండుట
4. దైవభక్తిని ఇతరులతో పంచుకొనుట
5. తన భర్తను ప్రేమించుట
6. తన పిల్లలను ప్రేమించుట
7. పవిత్ర జీవితం జీవించుట మరియు మంచి కార్యాలు చేయుట
8. ఆదర్శ గృహనిర్వాహకత్వం

## 1 సౌందర్యంపై దేవుని దృక్పథం గ్రహించుట

ప్రస్తుత కాలంలో స్త్రీలు బాహ్యాలంకరణ మోజులో వున్నారు. కొందరికైతే యిది కాలక్రమేణా మానసికంగానూ మరియు భౌతికంగానూ విషాదంగా మారుతూ వుంది. మా తల్లి సర్వసామాన్యమైన వ్యక్తి. దేవుని దృక్పథం ప్రకారమే తన సౌందర్యాన్ని అంచనా వేసుకునే అలవాటు ఆమెకు అలవడింది. ఒక వ్యక్తి ఏ విధంగా వస్త్రాలు ధరించాడు లేక ఆ వ్యక్తి ఏ విధంగా అలంకరించుకుంది అని ఆమె ఎన్నడు గమనించేది కాదు. **యేసుక్రీస్తు యొక్క పరిశుద్ధతను ధరించుకున్న ప్రజలతో కలిసి వుండుటకు ఆమె సంతోషించేది.** మా తల్లి తన అంతరంగ సౌందర్యంను 1 పేతురు 3:4 వాక్య ప్రకారం అభ్యాసం చేసింది. **"సాధువైనట్టియు, మృదువైనట్టియునైన గుణమను అక్షయాలంకారముగల మీ హృదయపు అంతరంగ స్వభావము మీకు అలంకారముగా ఉండవలెను అది దేవుని దృష్టికి మిగుల విలువగలది."** అది దేవుని లక్షణం. 1 తిమోతి 2:9,10లో చెప్పబడిన పౌలు మాటలను కూడ మా తల్లి అనుసరించింది. **"మరియు స్త్రీలును అణుకువయు స్వస్థబుద్ధియు గలవారై యుండి, తగుమాత్రపు వస్త్రముల చేతనేగాని జడలతోనైనను బంగారముతోనైనను ముత్యములతోనైనను మిగుల వెలగల వస్త్రములతోనైనను అలంకరించుకొనక, దైవభక్తిగలవారమని చెప్పుకొను స్త్రీలకు తగినట్టుగా సత్ క్రియలచేత తమ్మును తాము అలంకరించుకొనవలెను."**


శ్రీమతి జయమ్మ
సామాన్య వ్యక్తిత్వం

## 2 దేవుని స్వభావం ప్రతిబింబింపజేయుట

మా తల్లి దేవునియందు భయభక్తులతో జీవించింది. క్రైస్తవ సమాజంలో చాల మంచి గౌరవం సంపాదించుకుంది. సంఘంలో అనేకులకు ఆమె సహాయం చేసింది. సంఘకాపరి రెవ. సొలొమోను సహితం ఆమె గురించి "వాడబారని పుష్పం" అను పుస్తకం వ్రాసారు. ఆ పుస్తకంలో విభిన్న ప్రజల అభిప్రాయాలు, అనుభవాలు సేకరించి ముద్రించారు. ఇది ఒక మంచి పుస్తకం. ఆమె గుణలక్షణాలన్నీ ప్రస్తావించిన పుస్తకం అది.

ఆమె అపొస్తలుడైన పౌలు వ్రాసిన దేవుని మాటలకు విధేయత చూపింది. **"అన్నిటియందు నిన్ను నీవే సత్కార్యముల విషయమై మాదిరిగా కనుపరచుకొనుము"** తీతుకు 2:8. **"మాటలోను, ప్రవర్తనలోను, ప్రేమలోను, విశ్వాసములోను, పవిత్రతలోను, విశ్వాసులకు మాదిరిగా ఉండుము"** 1 తిమోతి 4:12. ఆ విధంగా మా తల్లి దేవుని లక్షణాలన్నీ ప్రతిబింబింపజేసింది.



స్త్రీల సహవాస కూడికలో శ్రీమతి జయమ్మ

కేంబ్రిడ్జ్ క్రికెట్ ఆటగాడు సి.టి. స్టడ్ ఈ విధంగా చెప్పాడు. "ఒకే ఒక జీవితం, అది త్వరలోనే గతించిపోతుంది. జీవితంలో క్రీస్తు కొరకు చేసిందే నిలుస్తుంది. యేసు కొరకు నీ జీవితం సమర్పించినప్పుడు నీవేమీ నష్టపోవు. నీ స్వార్థం నిమిత్తం నీవు జీవించినట్లయితే నీవేమి సంపాదించుకోలేవు."

## మా తల్లి గురించి స్నేహితులు మరియు బంధువులు చెప్పిన అభిప్రాయలు యిక్కడ ప్రస్తావిస్తున్నాను.

"శ్రీమతి జయమ్మ నిరంతర ప్రార్థనా యోధురాలు"

– శ్రీమతి వేదమణమ్మ సుబ్బారెడ్డి, దగ్గర బంధువు

"శ్రీమతి జయమ్మ తన వదినా మరదళ్ళను తన స్వంత అక్కాచెల్లెళ్లుగా చూసింది"

– శ్రీమతి రేచల్ జాషువ, దగ్గర బంధువు

"ఆమె ఆత్మీయ ఆదర్శ మాతృమూర్తి"

– డా. సుగుణమ్మ గంగిరెడ్డి, దగ్గర బంధువు

"శ్రీమతి జయమ్మ మంచి గుణలక్షణాల నిధి. వాటిలో శ్రేష్ఠంగా ప్రస్తావించవలసినవి 1. దీనత్వము 2. దాతృత్వము 3. నిరాడంబరత 4. మంచితనం."

– ఎమ్. ఎలీసబెత్ ఫిలిప్, దగ్గర బంధువు

"అమ్మగారు తన స్వంత పిల్లలను చూసుకున్నట్లుగానే మమ్ములను గురించి పట్టించుకునేవారు."

–శ్రీధర్, డ్రైవరు

"అమ్మగారు మాకు దేవతలాంటివారు."

– అంకాలమ్మ మరియు లక్ష్మి, ఇంటి పనివారు

"ఆమెలో యేసుక్రీస్తు ప్రేమను చూసాం"

– జెహరబీ, పొరుగున వున్న మహమ్మదీయురాలు

"శ్రీమతి జయమ్మ సమాజంలో ఎంతో ఉన్నత స్థితి కలిగి వున్నప్పటికీ, ఆమె ఎంతో దీనురాలైన వ్యక్తి."

– టి. రాజమ్మ, సంఘంలో స్నేహితురాలు

"ఆమె దీనత్వం ధరించుకున్న వ్యక్తి."

– శ్రీమతి & శ్రీ ఎస్. యేసురత్నం, సంఘంలో స్నేహితురాలు

## 3 సమాధానపరచువారిగా వుండుట





తగాదాలు పరిష్కరించుటలో ఆమె చొరవ తీసుకొని వాటిని పరిష్కరించేది. అందువలన ఆమె సమాధానపరచే వ్యక్తిగా పరిగణించబడింది. మనస్పర్థల విషయాన్ని దేవుడే చూసుకుంటాడని ఆమె ఎల్లప్పుడు విశ్వసించేది. ఆమె ఎన్నడూ ఎవరితోను తగాదా పెట్టుకోలేదు. ఆమె ఎన్నడూ వ్యర్థమైన సంభాషణకు తావివ్వలేదు లేక ఇతరుల జీవితాల మీద బురద చల్లలేదు. ఆమె ప్రజల వ్యక్తిగత సమస్యలు శ్రద్ధగా వినేది. వాటిని ఇతరులకు ప్రచారం చేసేది కాదు. వారి గురించి ఆసక్తితో ప్రార్థన చేసేది. ఇది సమాధానకర్త యొక్క ప్రధాన గుణలక్షణం.

**"సమాధానపరచువారు ధన్యులు; వారు దేవుని కుమారులనబడుదురు"** మత్తయి 5:9.
సమాధానకర్తయగు అధిపతి యేసు నాయకత్వంలో హృదయాలలో, మనసులలో, ఆత్మలలో శాంతి స్థాపించుటకు ఆయన సహవాసంలో చేరండి. యాకోబు 1:19లో వ్రాసిన విధంగా ఆమె ప్రవర్తన వుండేది. **"నా ప్రియ సహోదరులారా, మీరీసంగతి ఎరుగుదురు గనుక ప్రతి మనుష్యుడు వినుటకు వేగిరపడువాడును, మాటలాడుటకు నిదానించువాడును, కోపించుటకు నిదానించువాడునై యుండవలెను."**

## 4 దైవభక్తిని ఇతరులతో పంచుకొనుట

అవకాశం వచ్చినప్పుడెల్లా మా తల్లి దేవుని గురించి మాట్లాడేది, **తన ప్రవర్తన ద్వారా దైవభక్తిని చూపేది.** ఏది మంచిదో దానిని ఆమె ఎల్లప్పుడు చెప్పేది, ఆచరించేది. స్థానిక సంఘ స్త్రీల సహవాసానికి నాయకత్వం వహించేది, ఎల్లప్పుడు దేవుని వాక్యం ప్రకటించుటకు యిష్టపడేది. ఆమె గృహంలో స్త్రీల కూడిక ఏర్పాటు చేయుటకు ఆసక్తి చూపేది. క్రైస్తవులైనా, క్రైస్తవులు కాకపోయినా ఎవ్వరితోను వాదన పెట్టుకునేది కాదు. తన దగ్గరకు వచ్చిన ప్రజలు చెప్పే విషయాలు ఎంతో శాంతంగా వినేది. ఆమె దగ్గరకు ఎవరైనా నిరభ్యంతరంగా వెళ్ళుటకు అవకాశం వుండేది.

మా తల్లి తన సమాజంలో అభిషేకించబడిన నాయకురాలు. దేవుని యెడల ఆమెకున్న విశ్వాసం చేతను, పరిశుద్ధాత్మపూర్ణురాలైన చేతను ఆమెకు నాయకత్వ లక్షణాలు అలవడినాయి. 1995వ సంవత్సరంలో స్త్రీ పంచాయితీ అధ్యక్షురాలిగా ఏకగ్రీవంగా గెలుపొంది పులివెందులలో ఆమె చరిత్ర సృష్టించింది. గ్రామంలో రహదారులు బాగు చేయించింది, కుళాయి నీటి వసతులు ఏర్పాటు చేయించింది. గ్రామంలో ఆమె జరిగించిన అభివృద్ధి కార్యక్రమాల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం నుండి అవార్డులు అందుకుంది.

ఆమె మహిళా మండలి అధ్యక్షురాలిగా పేద స్త్రీల జీవనోపాధిలో సహాయపడింది. లయన్స్ క్లబ్ స్త్రీల విభాగాన్ని కూడ ఆమె ప్రారంభించి దానికి "ప్రియదర్శిని" అని పేరు పెట్టింది. ఆ క్లబ్‌కు అధ్యక్షురాలిగా సేవ చేసింది. ఆమె



1995వ సంవత్సరంలో పంచాయితీ అధ్యక్షురాలిగా శ్రీమతి జయమ్మ

అనేక వైద్య శిబిరాలు, ఉచిత నేత్ర పరీక్ష శిబిరాలు నిర్వహించింది. ఎంతోమంది రోగులకు శస్త్రచికిత్సలు చేయించింది.

పేద ప్రజలు వివాహాలు చేసుకునేటప్పుడు ఆమె వారికి ఆర్థికంగా సహాయం చేసేది. వారికి ఆహారం, వసతి, వైద్యసహాయం చేసేది. 2003వ సంవత్సరంలో కడప జిల్లాలో భయంకరమైన కరవు సంభవించినప్పుడు, 45 రోజులు ఆకలిగొన్న ప్రజలనేకులకు ఆకలి తీర్చింది.

## 5 తన భర్తను ప్రేమించుట



నా తండ్రితో నా తల్లి

మా అమ్మ చాలా మంచి భార్య. తన భర్తను సౌఖ్యంగా వుంచాలని శాయశక్తులా ఎంతో ప్రయత్నించింది. ఆయన అనేక పనులతో తీరిక లేకుండ వుండేవారు కాబట్టి ఆయన గురించి ఎంతో ప్రార్థన చేసేది. కొన్నిసార్లు మా తండ్రి అపాయకరమైన పరిస్థితుల్లో వుండేవారు. ఆయన చెడ్డవారిని ఎదిరించి సమాజంలో న్యాయం జరగాలని పోరాడేవారు. **మన ఐశ్వర్యం మరియు మన క్షేమం మీ అమ్మ ప్రార్థనల మీద ఆధారపడి వున్నాయని మా తండ్రి ఎల్లప్పుడు చెప్పుతూ వుండేవారు.** 1 పేతురు 3:1-2లో అపొస్తలుడైన పేతురు ఈ విధంగా సెలవిచ్చాడు. **"అటువలె స్త్రీలారా, మీరు మీ స్వపురుషులకు లోబడియుండుడి అందువలన వారిలో ఎవరైనను వాక్యమునకు అవిధేయులైతే, వారు భయముతోకూడిన మీ పవిత్ర ప్రవర్తన చూచి, వాక్యము లేకుండనే తమ భార్యల నడవడి వలన రాబట్టవచ్చును."**

మా తల్లి బైబిలును అనుసరించింది. ప్రతి పురుషుని విజయం వెనుక ఒక స్త్రీ వుంటుందనే సామెత వుంది. మా తండ్రి సాధించిన ప్రతి విజయం వెనుక మా అమ్మ పాత్ర వుంది. ఆమె మమ్మలందర్నీ పెంచి పెద్ద చేసింది, కుటుంబ సభ్యులందరి బాగోగులు చూసుకుంది. ఆ విధంగా మా తండ్రి బరువు బాధ్యతలు తేలిక చేసింది. కుటుంబ సభ్యుల బాధ్యత, బంధువుల బాధ్యత ఆమె భుజాన వేసుకొని మా తండ్రి మానసిక వత్తిడిని తగ్గించేది. ఆమె ప్రేమ స్వభావం 1 కొరింథీయులకు 13:4-7లో చెప్పిన విధంగానే వుండేది. "**ప్రేమ దీర్ఘకాలము సహించును, దయ చూపించును. ప్రేమ మత్సరపడదు; ప్రేమ డంబముగా ప్రవర్తింపదు; అది ఉప్పొంగదు; అమర్యాదగా నడువదు; స్వప్రయోజనమును విచారించుకొనదు; త్వరగా కోపపడదు; అపకారమును మనస్సులో ఉంచుకొనదు. దుర్నీతివిషయమై సంతోషపడక సత్యమునందు సంతోషించును. అన్నిటికి తాళుకొనును, అన్నిటిని నమ్మును; అన్నిటిని నిరీక్షించును; అన్నిటిని ఓర్చును.**"



## 6 తన పిల్లలను ప్రేమించుట

మా అమ్మ ఎంతో బాధ్యత, ప్రేమగల తల్లి. ఆమె జీవితమంతా తన పిల్లలకు ప్రేమతో సేవ చేయడంతోనే గడిపింది. ఆమె పిల్లల బాగోగుల గురించి ఎల్లప్పుడు ప్రార్థిస్తునే వుండేది. **"కుమారులు యెహోవా అనుగ్రహించు స్వాస్థ్యము గర్భఫలము ఆయన యిచ్చు బహుమానమే"** కీర్తన 127:3 అని బైబిలు స్పష్టంగా బోధిస్తూ వుంది. ఆమె మమ్ములను దేవుడిచ్చిన బహుమానంగా భావించి చాలా జాగ్రత్తగా పెంచింది. మేమంతా దేవుని మార్గంలో వుండాలని తాను శాయశక్తులా కృషిచేసింది. ఆమె మాకందరికీ జీవిత నైతిక విలువలను నేర్పించింది, మంచి పౌరులుగా తీర్చిదిద్దింది.

**"యేసు-చిన్నపిల్లలను ఆటంకపరచక వారిని నా యొద్దకు రానియ్యుడి పరలోకరాజ్యము ఈలాటివారిదని వారితో చెప్పెను"** మత్తయి 19:14. ప్రపంచంలో పిల్లలు ఎంతో నమ్మకమైనవారు. వారు పెరిగే వయసులో జీవితం గురించి ఆలోచించడం ప్రారంభిస్తారు. ఏది సత్యమో తెలుసుకొని, దానిని వెంబడించాలని కోరతారు. దీనికి ఎంతో సమయం, ఓర్పు, గ్రహింపు అవసరం. వారి దగ్గరకు వెళ్ళడానికి నిజమైన ప్రేమ అవసరం. ఈ చిన్న వయస్సులోనే

ఉత్సవంగా అనేకులు యేసును అంగీకరిస్తున్నారు. యౌవనంలో యేసుక్రీస్తును అంగీకరించిన అనుభవం మా తల్లికి వుంది. అందుచేత మేము పిల్లలుగా ఉన్నప్పుడే మాకు యేసుక్రీస్తును పరిచయం చేయాలని ఎంతో ప్రయాసపడింది. **ఆమె బలమైన పునాది కారణంగా, ఆమె పిల్లలమైన మేమంతా క్రీస్తు మార్గంలో నడుస్తూ వున్నాం.** ఆమె నిస్వార్థ జీవితమును బట్టి, ఆమె పిల్లలందరు, కోడళ్ళు, మనుమలు, మనుమరాండ్రు ఆమెకు పరిచర్య చేయడం ఆధిక్యతగా భావించారు. మేమందరం చెప్పగలిగింది ఏమంటే, ఆమెకు పరిచర్య చేసే అవకాశం ఆమె మాకెన్నడు యివ్వలేదు.



తన కుటుంబంతో శ్రీమతి జయమ్మ

## 7 పవిత్ర జీవితం జీవించుట మరియు మంచి కార్యాలు చేయుట

మా తల్లి పరిశుద్ధ జీవితం జీవించింది, ఎల్లప్పుడు ఇతరులకు సహాయం చేసింది, నిరాడంబంమైన నిస్వార్ధ జీవితం కొనసాగించింది, దేవుని వాక్యం ప్రకటించింది. ఆమెకున్న సహాయపడే స్వభావం, సమస్త మంచి కార్యాలు చేయుటలో ఆమె సమర్పణ అందరికి తెలుసు.



మిషనెరీలతో మరియు బంధువులతో శ్రీమతి జయమ్మ

మా తల్లిదండ్రులు సహాయం చేసిన మా గ్రామ మహిళ సరస్వతితో నేను మాట్లాడాను. ఆమె భర్త ఆమెను చిత్రహింసలు పెట్టినప్పుడు ఆత్మహత్య చేసుకొనుటకు ప్రయత్నించింది. ఆమె తన శరీరం మీద కిరసనాయిలు పోసుకొని అంటించుకున్న సమయంలో ఎవరో ఆమెను కాపాడి నా తల్లి దగ్గరకు తీసుకొని వచ్చారు. అమ్మ మా ఆసుపత్రిలో ఆమెకు ఉచిత చికిత్స చేయించారు. ఆమె సాధారణస్థితికి వచ్చే వరకు అన్ని రకాలుగా మా తల్లిదండ్రులు సహాయం చేశారు. మా కళాశాలలో ఆమెకు ఉద్యోగం యిచ్చారు. గవర్నమెంటు చౌకధరల




పులివెందులలో వై.ఎస్.ఆర్.ఆర్. ఆసుపత్రి

దుకాణం పెట్టుకొనుటకు సహాయం చేశారు. ప్రతి సందర్భంలో ఆమెకు నైతిక ప్రోత్సాహం యిచ్చారు. ఇదంతా ఆమె తన ఇద్దరు పిల్లలను చక్కగా చదివించుకొని, వివాహాలు చేయుటకు సహాయపడింది.

నేను మా తల్లి గురించి ఆమెతో మాట్లాడినప్పుడు, ఆమె కన్నీళ్ళు పెట్టుకుంది. ఆమె రోజుకు రెండు సార్లు అమ్మను కలిసేదని చెప్పింది. మా తల్లి ఆమెకు దేవుని వాక్యం చెప్పేది గాని ఎన్నడు బాప్తిస్మం తీసుకొమ్మని ఆమెను బలవంతం చేయలేదు. అనేకసార్లు ఆర్థికంగా కూడ మా తల్లి సహాయం చేసిందని ఆమె చెప్పింది. ఆమె మంచం ఎదురుగా మా తల్లిదండ్రుల ఫోటో గోడకు

తగిలించుకుంది. ప్రతి ఉదయాన్నే లేచిన వెంటనే ఆమె చేసే పని ఏమంటే వారు ఆమెకు చేసిన సహాయం గురించి తలంచటం. మా తల్లిదండ్రుల ద్వారా ఆమె వలె సహాయం పొందిన అనేకులు మా గ్రామంలో వున్నారు.

మరొక స్త్రీ హెలీనమ్మ, ప్రభువునందు నిద్రించిన స్థానిక సంఘ కాపరి రెవ. దేవదానంగారి భార్య మా తల్లి గురించి ఈ సాక్ష్యం చెప్పింది. 1988వ సంవత్సరంలో వారు ప్రొద్దుటూరు నుండి పులివెందులకు బదిలీ అయినప్పుడు, మా తల్లి తన పట్ల చూపిన ప్రేమను ఆమె వివరించింది. మా తల్లి పట్ల శ్రీమతి హెలీనమ్మ కూడ ఎంతో ప్రేమ, గౌరవం పెంచుకుంది. మా తల్లి ఆమె గృహాన్ని దర్శించి, కుటుంబానికి దూరంగా ప్రొద్దుటూరులో ఆమె ఒంటరిగా పడుచున్న ప్రయాస చూసి ఆమెను పులివెందులకు బదిలీ చేయించుటకు సహాయపడింది. మా తల్లి ఆమెకు చేసిన సహాయన్ని ఎన్నడూ మరువలేను అని హెలీనమ్మ చెప్పింది.

ప్రతి ఆదివారం ఆలయంలో మరియు స్త్రీల సహవాసంలో వారిద్దరు కలుసుకునేవారు. తరువాత వీరు గొప్ప స్నేహితులైనారు. స్త్రీల సహవాసంలోని ఇతర సభ్యులందర్నీ మా తల్లి ఏ విధంగా చూసుకునేదో అనే విషయం కూడ హెలీనమ్మ వివరించింది. వారందరి సమస్యలన్నీ మా తల్లి ఎంతో ఓర్పుతో వినేదని, వారి గురించి ప్రార్థన చేసి, తన పరిధిలో వారికి తగిన సహాయం చేసేదని చెప్పింది. **ధనికులు మరియు పేదల మధ్య ఆమె ఎన్నడూ వ్యత్యాసం చూపేది కాదు.** ఆమె వారందరి గృహాలు దర్శించి, వారేమి అల్పాహారం పెడితే

దానిని తినేది. ఒకరోజు ఒక సంఘ సభ్యురాలి గృహానికి వెళ్ళింది. ఆ గృహం మొదటి అంతస్థులో వుంది. అప్పుడు మెట్లు ఎక్కుటకు మా తల్లి బలహీనంగా వున్నప్పటికీ ఏమి వెనుకాడకుండ మెట్లన్నీ ఎక్కి వారి ఇంట్లోకి ప్రవేశించి, వారితో కొంత సమయం ప్రార్థనలో గడిపింది. ఆమె ప్రేమ, దీనత్వం అటువంటివి.

వివిధ గ్రామాలలో సువార్తను ప్రకటించడానికి వెళ్ళే సంఘ బృందంతో పాటు తను కూడా వెళ్ళడానికి మా తల్లి ఎంతో ఆసక్తి చూపేది. వారందరికీ తన స్వంత కారులో ఆ గ్రామాలకు ఆమె తీసుకొని వెళ్ళేది. ఆమె తీవ్ర అస్వస్థతతో ఉన్నప్పటికీ ఏనాడూ ఆదివారపు సంఘారాధన మానలేదు.



లయన్స్ క్లబ్ స్త్రీల విభాగం సభ్యులతో శ్రీమతి జయమ్మ

## 8 ఆదర్శ గృహనిర్వాహకత్వం

మా తల్లి ఆదర్శ గృహనిర్వాహకురాలు. ఆమె ఎంతో నేర్పరియైన గృహ యజమానురాలు. ఆమె ఎంతో సామర్థ్యంతో గృహ కార్యకలాపాలను నిర్వర్తించేది. అతిథులను ఎంతగానో ఆదరించి, సత్కరించేది. సేవకు వచ్చిన మిషనరీలను తన ఇంట్లోనే బస చేయమని కోరేది, వారి బాగోగులు చక్కగా చూసుకొనేది. ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించుటకు మా గ్రామానికి వచ్చిన వైద్యులందరికీ భోజనం పెట్టుటకు ఎల్లవేళలా



బంధువులతో శ్రీమతి జయమ్మ

సిద్ధంగా ఉండేది. తన గుమ్మం వద్దకు వచ్చే భిక్షకులకు ఎల్లప్పుడూ భోజనం పెట్టి వారి ఆకలి తీర్చేది.

మా తల్లి ఇంట్లోని అనుదిన కార్యకలాపాలు చూసుకోవడం మాత్రమే కాకుండ మా తండ్రికి ఎంతో





శ్రీమతి జయమ్మ చివరి జన్మదిన సందర్భాన

సహకారం అందించేది. ఆమె పెద్దలను, బంధువులను కూడ మర్యాదగా చూసేది. ఆమె వదినా మరదళ్ళందర్నీ ఎంతో ప్రేమించింది. అందుచేత వారిలో ముగ్గురు పదవీ విరమణతరువాత వారి పిల్లల దగ్గర వుండకుండ మా తల్లికి సమీపంలో స్థిరపడాలని తీర్మానించుకున్నారు.

నేను చదివిన పుస్తకంలో ప్రస్తావించిన మార్గనిర్దేశి లక్షణాలన్నీ మా తల్లిలో ఉన్నాయని చెప్పుటకు గర్వపడుచున్నాను. ఆమె ఆదర్శ మాతృమూర్తి. అందరిచే గౌరవించబడిన తల్లి. ఆమె మనకు ఈ విధంగా చెప్పుతుందని నేను భావిస్తున్నాను. **"నేను క్రీస్తును పోలి నడుచుకొనుచున్న ప్రకారము మీరును నన్ను పోలి నడుచుకొనుడి"** 1 కొరింథీయులకు 11:1. **"మంచి పోరాటము పోరాడితిని, నా పరుగు కడ ముట్టించితిని, విశ్వాసము కాపాడుకొంటిని"** 2 తిమోతి 4:7.

# శ్రీమతి జయమ్మ - ప్రార్థనా యోధురాలు

**"యెహోవా దృష్టి ఆయనయందు భయభక్తులుగలవారి మీదను ఆయన కృపకొరకు కనిపెట్టువారిమీదను నిలుచుచున్నది"** కీర్తన 33:19

మా జీవితాల్లోని అనేక సందర్భాల్లో ప్రాముఖ్యంగా మా తల్లి ప్రార్థనలు మమ్మును ప్రభావితం చేసాయి. వీటిలో కొన్ని సంఘటనలు ఇక్కడ నేను ప్రస్తావిస్తున్నాను.

మా పెద్దన్న జార్జిరెడ్డి యౌవనంలో వున్నప్పుడు చాల భక్తిగా వుండేవాడు. అనంతపూరు ఇంజనీరింగ్ కళాశాలలో చదువుచున్నప్పుడు గిటార్ వాయిస్తు, మంచి పాటలు పాడుతూ యేసుప్రభువును ఘనపరచేవాడు. తరువాత అతడు దేవునికి దూరమైపోయి ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నాడు. అతనికి ఏదైన పెద్ద సమస్య వచ్చిన ప్రతిసారి, అతడు, అతని భార్య భారతి, ప్రార్థనల కొరకు మా తల్లి దగ్గరకు

వెళ్ళేవారు, వారి సమస్యలు ఆమెతో చెప్పుకునేవారు. మా తల్లి ప్రార్థనల వలన అవి పరిష్కరించబడేవి. ప్రస్తుతం మా వదిన ఆమె పిల్లలందరి గురించి ప్రార్థన చేస్తూ వుంది, ఫలితంగా వారు ఆశీర్వదించబడినారు.



పెద్దకుమారుడు జార్జిరెడ్డి కుటుంబంతో శ్రీమతి జయమ్మ

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అయిన మా రెండవ అన్న రాజశేఖర్ రెడ్డి యౌవనంలో వున్నప్పుడు ఆలయానికి క్రమంగా వెళ్ళేవాడు. అతడు వైద్య కళాశాలలో వున్నప్పుడు ప్రమాదానికి గురైనాడు. అప్పుడు మా తల్లి ప్రార్థనల వలన బ్రతికి క్షేమంగా వున్నాడు. 1977వ సంవత్సరంలో సచివాలయంలో తుపాకితో కాల్చబడినప్పుడు సహితం మా తల్లి ప్రార్థనల వలన కాపాడబడినాడు.



అమ్మతో రెండవ కోడలు శ్రీమతి విజయలక్ష్మి

ప్రస్తుతం ముఖ్యమంత్రి భార్య శ్రీమతి విజయలక్ష్మి ప్రార్థనా భారాన్ని హృదయపూర్వకంగా స్వీకరించింది. మా కొరకు మరియు రాష్ట్రమంతటి గురించి ఆమె ప్రార్థన చేస్తూ వుంది. వారి కుటుంబమంతా ప్రార్థనా యోధులుగా మారారు. దేవుని రాజ్యం కట్టుటలో వారు ఎంతో కృషి చేస్తున్నారు. వారందరు యేసుక్రీస్తులోనికి రావడం చూసి మా తల్లి ఎంతగానో సంతోషించింది. మా అన్న అల్లుడు అనిల్ కుమార్ సంపూర్ణ సువార్తికునిగా సేవ చేస్తున్నాడు, షర్మిలా కూడ దేవుని సేవ చేస్తూ వుంది.

మా మూడవ అన్న వివేకానందరెడ్డి 18 సంవత్సరాల ప్రాయంలో బావిలో పడిపోయాడు. అప్పుడు అతని కాలు విరిగి పైకి రాలేకపోయాడు. ఆ సమయంలో అందరూ భయపడిపోయారు, అప్పుడు మా తండ్రి కూడ ఇంట్లో లేరు. యేసునందు

అత్యంత విశ్వాసముంచిన మా తల్లి ప్రార్థన చేయడం ప్రారంభించింది. దేవుడు మా తండ్రి స్నేహితుడైన గురివిరెడ్డిని ఆ స్థలానికి పంపాడు. అతడు మా అన్నను బావిలో నుండి బయటకు తీసాడు. మా తల్లి అడుగుజాడల్లో నడవాలని మా అన్న భార్య శ్రీమతి సౌభాగ్య ఎంతగానో ప్రయాసపడుతూ వుంది.



మూడవ కుమారుడు, కోడలు మరియు కుమార్తెతో శ్రీమతి జయమ్మ


నాల్గవ వాడైన నా తమ్ముడు సుధీకర్ రెడ్డి దాదాపు 13 సంవత్సరాల ప్రాయంలో అసాధారణమైన ప్రమాదానికి గురైనాడు. అతడు పాఠశాల ఆట స్థలంలో ఆడుకుంటున్నప్పుడు చేతిఈటె వచ్చి నొసలుకు తగిలింది. అది అతని తలలో దూసుకొనిపోవుట వలన మెదడు కొంచెం బయటకు వచ్చింది. వైద్యులందరు

అతడు బ్రతకడు అని చెప్పారు. అతన్ని వెల్లూరు ఆసుపత్రికి తీసుకొనివెళ్ళమని చెప్పారు. అప్పుడు ప్రతి ఒక్కరు భయపడినప్పటికీ, మా తల్లి ప్రార్థన చేస్తూనే వుంది. వైద్యులైన మా చిన్నాన్న, మేనత్త సహాయంతో మా తల్లి మా తమ్ముని వెల్లూరుకు తీసుకొని వెళ్ళింది. దేవుని కృపను బట్టి మరియు మా తల్లి చేసిన ఎడతెగని ప్రార్థనలను బట్టి మెదడుకు ఎటువంటి నష్టం కలగకుండ అద్భుతంగా అతడు బాగుపడినాడు. మా తండ్రి కంట్రాక్టరు కాబట్టి ఆయన ఎల్లప్పుడు బయట ఊర్లు తిరుగుతూ వుండేవారు. అందుచేత ఎక్కువ సమయం మా తల్లి మమ్మలను చూసుకోవలసి వచ్చేది. ఇప్పుడు సుధీకర్ రెడ్డి భార్య భక్తిగల క్రైస్తవురాలు. ఆమె తన భర్త గురించి, కుమార్తె గురించి ప్రార్థిస్తూ వుంది.



నాల్గవ కుమారుడు మరియు కుమార్తెతో శ్రీమతి వై. ఎస్. జయమ్మ

10 ఒకసారి ఐదవవాడైన నా తమ్ముడు రవీంద్రనాథ్ రెడ్డికి ఆట స్థలంలో క్రికెట్ బంతి తగిలి ముక్కు ఎముక విరిగిపోయింది. విస్తారంగా రక్తం కారింది. గాయం [illegible] కాకుండ మా తల్లి ప్రార్థనల వలన బాగుపడినాడు. అతని భార్య జయ, మా అమ్మ నిస్వార్థం మరియు విశ్వాసం వలన ఎంతగానో ప్రభావితురాలైంది. ఇప్పుడు ఆమె ఎల్లప్పుడు ఆమె భర్త గురించి, పిల్లల గురించి ప్రార్థన చేస్తూనే వుంటుంది.



ఐదవ కుమారుడు, అతని కుటుంబంతో శ్రీమతి జయమ్మ

మా తల్లి మాతో లేని కారణం చేత నా వదినలు, మరదళ్ళు అదనపు ప్రార్థనా భారాన్ని కలిగి వున్నారు.



నా భర్త మరియు పిల్లలతో నేను

చిన్న వయసులోనే నేను విధవరాలినయ్యాను కాబట్టి నాకు నా తల్లి ప్రార్థనలు ఎక్కువగా అవసరమైనాయి. నా ప్రతి అడుగులో ఆమె నా ప్రార్థనా సహాయకురాలు. నా పిల్లలు ఆమెతో ఎంతో సన్నిహితంగా వున్న కారణం చేత, ఆమె మంచి లక్షణాల వలన వారు ప్రభావితులైనారు. మా కుటుంబం గురించి ఆమె చేసిన ప్రార్థనలన్నీ దేవుడు విన్నాడు, జవాబిచ్చాడు. ప్రస్తుతం మేము ఆనందంగా వున్నాం. మా తల్లి నా అత్తమామలను కూడ ఎంతగానో ప్రభావితం చేసింది. వారందరు మా తల్లిని ఎంతగానో ప్రేమించారు.



మా అత్తతో మా తల్లి శ్రీమతి జయమ్మ మరియు నేను

ఈ కారణం చేత మా అత్తమామల కుటుంబం హిందూమతాన్ని అనుసరిస్తున్నపటికీ, మా గ్రామంలో మా తల్లి జ్ఞాపకార్థం ఆలయం వుండటం వారికి ఆనందంగా వుంది. వారందరి గురించి మా తల్లి ప్రార్థన చేస్తుండేది. నా అత్త మా అమ్మను కలిసినప్పుడెల్లా తన గురించి ప్రార్థన చేయమని కోరేది. మా తల్లి చేసిన ప్రార్థనల వలన, ఆ తరువాత సంఘకాపరి సజీవ్ కుమార్ (వై. ఎస్. జయమ్మ

జ్ఞాపకార్థ ఆలయం సంఘకాపరి) చేసిన ప్రార్థన వలన మా అత్తకు అనేక అనారోగ్య సమస్యలు వున్నప్పటికీ ప్రశాంతంగా మరణించింది.

పనివారి దగ్గర కొంచెం ఖాళీ సమయం దొరికినప్పుడెల్లా, వారందర్నీ కూర్చోబెట్టి వారికి బైబిలు కథలు వివరించేది, దేవుని వాక్యం బోధించేది. ఫలితంగా మా పని వారందరు క్రీస్తును నమ్మారు. ఆమె ఎక్కువ సమయం బైబిలు ధ్యానించుటకు, స్త్రీల సహవాసంలో బోధించు నిమత్తం నోట్సు సిద్ధం చేసుకొనుటకు ఉపయోగించేది. ఆమె చివరి రోజుల్లో బైబిలు నోట్సు దస్తూరి చక్కగా వ్రాయలేకపోతున్నానని విచారించేది.

మా తల్లి జీవితం ప్రార్థనతో నిండిన జీవితం. ఆమె చివరిగా అపస్మారక స్థితికి వెళ్ళక ముందు సహితం మా మేనత్త రాజమ్మతో ఫోనులో చెప్పిన ఈ మాటలు గమనించదగినవి : **"రెడీగా ఉండు, జూనియర్ బాలికల కళాశాలలో జరిగే సి.బి.యస్. (కమ్యునిటీ బైబిల్ స్టడి)కు వెళ్దాం."**



శ్రీ వై.ఎస్. వెంకట రెడ్డి జూనియర్ బాలికల కళాశాల

# స్వయానికి ముగింపు దేవుని ప్రేమకు ప్రారంభం

నీవు మరణించేటప్పుడు నీతో నీ ధనాన్ని తీసుకొని వెళ్ళలేవు గాని దానిని ముందుగా పరలోకానికి పంపగలవు. దేవుని గురించి, ఆయన పని గురించి ఆలోచించినప్పుడు, ఆయన పనికి యివ్వడం మంచి వ్యాపారం. ఇది మంచి పెట్టుబడి. ఎందుచేతనంటే ఈ పెట్టబడికి సాధ్యమైనంత ఎక్కువ శాతం వడ్డీ వస్తుంది. దీనిమీద వచ్చే లాభాలు వందల రెట్లు ఈ జీవితంలో, రానున్న నిత్యలోక జీవితంలో వస్తాయి. అది దేవుని వాగ్దానం. అమ్మ ఈ సత్యాన్ని గ్రహించింది. పరలోకంలోని ఆమె పొదుపు ఖాతా ఎంతో ఎక్కువగా వుంటుందని నా దృఢమైన నమ్మకం. నా తల్లిదండ్రులిద్దరు గొప్ప పరోపకారులు. వారు ఆసుపత్రి, ఆలయాలు మరియు విద్యా సంస్థలు స్థాపించారు. పేదవారికి ఉచిత వైద్య సేవలు చేయుటకు మా రెండవ అన్న వై. ఎస్. రాజశేఖర్ రెడ్డికి పులివెందులలో ఒక ఆసుపత్రి

కట్టించారు. ఆయన రాజకీయాల్లో ప్రవేశించిన తరువాత, ఆయన వేరే వైద్యులను నియమించి ఉచిత వైద్యసేవలు యిప్పటికీ జరిగిస్తునే వున్నాడు. అక్కడ వున్న రోగుల మధ్య దేవుని వాక్యం ప్రకటించుటకు వారానికి ఒకసారి మా తల్లి వెళ్ళేది.




పులివెందులలో స్థాపించబడిన డిగ్రీ కళాశాల

ఆమె దగ్గరకు వచ్చే సేవకులందర్నీ దయతో ఆదరించేది. క్రిస్మసు కాలంలో ఆమెకు తెలిసి వున్న సంఘకాపరులందరికీ వస్త్రాలు కొని యిచ్చేది. క్రిస్మసు కాలంలో అడుక్కునే వారికి యిచ్చుటకు చీరలు చాల కొనేది. ఒకవేళ వచ్చిన అడుక్కునే వారికి కొన్న చీరలు చాలకపోయినట్లయితే తన చీరలు యిచ్చేది.

మానవ సేవ చేయాలని ఆమె తన పిల్లలందర్నీ ప్రోత్సాహించింది. ఆమె ప్రార్థనలు, ప్రోత్సాహం బట్టి ఒక అన్న ముఖ్యమంత్రి అయ్యాడు, మరొక అన్న లోకసభ సభ్యుడయ్యాడు, ఒక మనుమడు జగన్, వై. ఎస్. ట్రస్ట్ తరపున ప్రజలకు ఎంతో సేవ చేస్తున్నాడు.



పులివెందులలో వై.ఎస్.ఆర్.ఆర్. పార్కు

పూర్తిగా పరిపక్వత చెందిన స్థాయి క్రైస్తవులుగా మనం ఎదగాలని యేసుక్రీస్తు కోరుచున్నాడు. **ఆత్మీయ స్థాయిలో ఎదుగుదల కాలానికి సంబంధించినది కాదు గానీ ఇది యేసుతో, ఆయన వాక్యంతో వుండే సంబంధం మీద, నీ విధేయత మీద మరియు దీనత్వం మీద ఆధారపడి వుంది.** ఒక పిల్లవాడు


బాధ్యతతో వ్యవహరించడం నేర్చుకున్నప్పుడు, ఇతరుల గురించి ఆలోచించినప్పుడు నిజమైన వ్యక్తిగా మారతాడు. ఇదే విధంగా క్రైస్తవుల్లో కూడ జరుగుతుంది. దేవుని కృపను బట్టి మా తల్లి ఈ ఆత్మీయ పరిపక్వత స్థాయి పొందుకుంది. ఆమె కుమార్తెగా నేను జన్మించినందుకు గర్వపడుచున్నాను.




పులివెందులలో స్థాపించబడిన పాలిటెక్నిక్ కళాశాల

# అమ్మ శ్రేష్ఠమైన ధననిధి "పరిశుద్ధ బైబిలు"

దేవుని ప్రియమైన కుమార్తె ధ్యానించిన బైబిలు చూసినట్లయితే, ఆమె దేవుని వాక్యాన్ని ఎంత శ్రద్ధగా ధ్యానించినదో చూచి ఆశ్చర్యపోతాము. ఆమె ప్రభువును ప్రేమించింది. ఆమె దేవుని వాక్యాన్ని ప్రేమించింది. ఆమె లెదర్ అట్టతో ఉన్న పెద్ద బైబిలు ఉపయోగించింది. ఆమె ఉపయోగించిన బైబిల్లోని ప్రతి పేజి నలిగిపోయి వుంది. ఆమె వెళ్ళిన ప్రతి స్థలానికి బైబిలు తీసుకొని వెళ్ళేది. మా తల్లి ఉదయం పెందలకడనే లేచి దేవుని వాక్యం ధ్యానించేది. పరిపూర్ణ క్రైస్తవునికి కావలసిన పరిశుద్ధత, దేవుని భద్రత, దేవుని నుండి సమృద్ధి ఆశీర్వాదాలు, దేవుని మీద ఆధారపడుట అను అంశాలను గుర్తించుటలో ఎంతో శ్రద్ధ తీసుకునేది.



మా అమ్మ బైబిల్

## ప్రధాన అంశాలు

- ✓ ఎక్కువగా గుర్తులు పెట్టిన పుస్తకం **ఆదికాండము**. ఆదికాండములో మూలపితరుల జీవిత వృత్తాంతాలను మా అమ్మ ప్రేమించింది.
- ✓ బైబిల్లో సరిచేసిన అచ్చుతప్పులు – సామెతలు 8:36 హెబ్రీయులకు 11:17
- ✓ ఎక్కువ వచనాలు గుర్తులు పెట్టిన అధ్యాయం – కీర్తన 119
- ✓ ప్రత్యేక ప్రాముఖ్య అంశంగా గుర్తులు పెట్టిన వాక్యం – యెషయా 53:1-8
- ✓ 2 రాజులు 20:12-21 వాక్యాభాగానికి తరువాత పేజీలో “పొగడ్తలతో కొట్టుకొనిపోవద్దు” అని ఆమె వ్రాసుకుంది.

## మా తల్లి ధ్యానించిన బైబిల్లోని కొన్ని వచనాలు

- 1 కొరింథీయులకు 13:4-8 "ప్రేమ దీర్ఘకాలము సహించును... ప్రేమ శాశ్వతకాలముండును."
- యెషయా 54:10 "పర్వతములు తొలగిపోయినను... నా కృప నిన్ను విడిచిపోదు. సమాధానవిషయమైన నా నిబంధన తొలగిపోదు."
- యోహాను 1:12 "తన్ను ఎందరంగీకరించిరో వారికందరికి... దేవుని పిల్లలగుటకు ఆయన అధికారము అనుగ్రహించెను."
- యోహాను 3:16 "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయకుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను."
- యోహాను 5:24 "నా మాట విని నన్ను పంపినవానియందు విశ్వాసముంచువాడు... మరణములో నుండి జీవములోనికి దాటి యున్నాడు."
- యోహాను 14:2-4 "నా తండ్రి యింట అనేక నివాసములు కలవు... నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చిన నా యొద్ద నుండుటకు మిమ్మును తీసికొనిపోవుదును."
- మత్తయి 20:28 "ఆలాగే మనుష్యకుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదు గాని పరిచారము చేయుటకును అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణము నిచ్చుటకును వచ్చెనని చెప్పెను."
- రోమా 8:28 "దేవుని ప్రేమించువారికి, అనగా ఆయన సంకల్పము చొప్పున పిలువబడినవారికి, మేలు కలుగుటకై సమస్తమును సమకూడి జరుగుచున్నవని యెరుగుదుము."

† ఫిలిప్పీయులకు 3:20 "మన పౌరస్థితి పరలోకమందున్నది అక్కడనుండి ప్రభువైన యేసుక్రీస్తు అను రక్షకుని నిమిత్తము కనిపెట్టుకొనియున్నాము."

† 1 పేతురు 1:19 "అమూల్యమైన రక్తముచేత, అనగా నిర్దోషమును నిష్కళంకమునగు గొఱ్ఱెపిల్లవంటి క్రీస్తు రక్తముచేత, విమోచింపబడితిరని మీరెరుగుదురు గదా."

† హబక్కూకు 2:4 "వారు యథార్థపరులు కాక తమలో తాము అతిశయపడుదరు అయితే నీతిమంతుడు విశ్వాసము మూలముగ బ్రదుకును."

† కీర్తన 91:10-11 "నీకు అపాయమేమియు రాదు ఏ తెగులును నీ గుడారమును సమీపించదు. నీ మార్గములన్నిటిలో నిన్ను కాపాడుటకు ఆయన నిన్ను గూర్చి తన దూతలకు ఆజ్ఞాపించును."

† యెహోషువ 1:9 "నేను నీ కాజ్ఞయిచ్చియున్నాను గదా, నిబ్బరముగలిగి ధైర్యముగా నుండుము, దిగులుపడకుము జడియకుము. నీవు నడుచు మార్గమంతటిలో నీ దేవుడైన యెహోవా నీకు తోడైయుండును."

† యోబు 28:28 "మరియు యెహోవాయందలి భయభక్తులే జ్ఞానమనియు దుష్టత్వము విడచుటయే వివేకమనియు ఆయన నరులకు సెలవిచ్చెను."

చివరిగా, తిమోతిని ఆతని తల్లి **దేవుని వాక్యంచే పెంచిన విధంగానే** మా తల్లి తన పిల్లలను, మనుమలను, మునిమనుమలను దేవుని వాక్యంతో పెంచింది.

# నివాళులు

## శ్రీ ఎస్. ప్రభుదాస్ రెడ్డి

గొప్ప ప్రార్థనాపరుడైన సువార్తికుడు
మరియు మా పెద్దనాన్న



శ్రీ మరియు శ్రీమతి ఎస్. ప్రభుదాస్ రెడ్డి

మా పెద్దనాన్న, గొప్ప సువార్తికుడైన శ్రీ ఎస్. ప్రభుదాసు గారి దగ్గరకు వెళ్ళి, మా అమ్మ గురించి ఆయన అభిప్రాయాలు అడిగినప్పుడు ఈ విధంగా వివరించారు.

జయమ్మ బాల్యం నుండి నాకు తెలుసు. ఆమె తల్లి మాకు బంధువు. ఆమె తల్లి మరియమ్మ భర్త మరణించినప్పుడు తన కుమార్తె జయమ్మను తీసుకొని మా దగ్గర వుండుటకు వచ్చింది. చదువు నిమిత్తం జయమ్మను మద్రాసులోని బెంటింక్ పాఠశాలకు పంపించాం. ఆమె 10వ తరగతి చదివి ముగించిన తరువాత మా చిన్న తమ్ముడు రాజారెడ్డితో ఆమెకు వివాహం చేయాలని మా పెద్దలందరు నిర్ణయించారు. ఆమె వివాహం చేసుకున్న తరువాత తన పిల్లలను దైవభక్తిలో పెంచే బాధ్యత ఆమె చేపట్టింది.

ఆమె యౌవనంలో వున్నప్పుడు, ఆమె ఆత్మీయ అనుభవం తెలుసుకోవాలని అనుకున్నాను. ఆ సందర్భంలో క్రీస్తునందు విశ్వాసముంచావా? ఆయన రక్షణపొందుకున్నావా? అని ఆమెను ప్రశ్నించాను. వెంటనే ఆమె దృఢనిశ్చయంతో తనకు దేవుడు యిచ్చిన రక్షణపొందుకున్నానని గట్టిగా చెప్పింది. ఆ విషయం విని నేను ఎంతో సంతోషించాను. ఆమె తన భర్త రక్షణగురించి ప్రార్థిస్తూనే వుండేది.

1997వ సంవత్సరంలో నా తమ్ముడు రాజారెడ్డి గుండె శస్త్రచికిత్సకు ముందు నేను క్రీస్తును గురించి స్పష్టంగా అతనితో మాట్లాడాను. యేసు మన పాపముల నిమిత్తం ఏ విధంగా మరణించాడో, మనకు రక్షణఏ విధంగా వస్తుందో అనే విషయాలు చెప్పాను. శస్త్ర చికిత్సకు ముందే నా తమ్ముడు రక్షణపొందాడు, క్రీస్తును తన స్వంత రక్షకునిగా అంగీకరించాడు. అతడు తన పాపాలు ఒప్పుకున్నాడు, తన భార్యను కూడ క్షమాపణ అడిగాడు. తరువాత భార్యభర్తలు యిద్దరి మధ్య పరిపూర్ణ సమాధానం కనుగొన్నాను. తదుపరి, నేను జయమ్మను ఆమె

భర్త గురించి అడిగినప్పుడు, తన భర్త పూర్తిగా మారిపోయాడని, దేవుని వాక్యం చదువుచున్నాడని, ఆలయానికి క్రమంగా వస్తున్నాడని చెప్పింది. ఆమె ఎంతో సంతోషంతో ఆ సాక్ష్యం చెప్పింది.

మా తల్లిదండ్రులకు మేము ఐదుగురు కుమారులం. శ్రీమతి జయమ్మ మిగిలిన తోడికోడళ్ళందరికీ ఆదర్శంగా జీవించింది. ఆమె దేవుని పట్ల ఎంతో విధేయత కలిగి జీవించింది. ఇందు నిమిత్తం నేను దేవుని స్తుతిస్తున్నాను. నా తమ్ముడు శ్రీ రాజారెడ్డి, ఆయన భార్య శ్రీమతి జయమ్మతో నేను సర్వశక్తుడైన దేవుని సన్నిధిలో వుండబోతానని సంతోషిస్తున్నాను. దేవుని పిలుపు కొరకు నేను ఎదురుచూస్తున్నాను.

# శ్రీమతి రాజమ్మ డేవిడ్

**శ్రీమతి జయమ్మకు మరదలు**

శ్రీమతి జయమ్మ నా అన్న భార్య కాబట్టి, వదిన అని పిలవడం కంటె నా ప్రాణస్నేహితురాలు అని పిలవడం నేను యిష్టపడతాను. ఆమె పసిప్రాయంలో వుండగానే ఆమె తండ్రి మరణించాడు. జయమ్మ తల్లి మా నాన్న చిన్నాన్న కుమార్తె. భర్తను కోల్పోయిన మా మేనత్తను, ఆమె కుమార్తెను మా తండ్రి మా యింటికి తీసుకొని వచ్చాడు. జయమ్మ తెలివైన బాలిక. చదువు పట్ల ఆసక్తి వుండి కష్టపడి చదివే విద్యార్థి. మాద్రాసులోని (చెన్నై) బెంటిక్ ఉన్నత పాఠశాలలో మేమిద్దరం కలిసి చదువుకున్నాం. ఆమె 10వ తరగతి ముగించిన వెంటనే ఆమెకు వివాహమైంది. తరువాత ఆమె పులివెందులలో వున్న బోర్డు ఉన్నత పాఠశాలలో ఎస్.ఎస్.ఎల్.సి. చదివి మొదటి శ్రేణిలో ఉత్తీర్ణురాలైంది. ఆమె తల్లి మరియమ్మ జయమ్మను యింకా పై చదువు చదివించాలని ఆశించింది గాని 1947వ సంవత్సరం జూన్ 3వ తేదిన ఆమెకు కుమారుడు జన్మించుట వలన చదువుకు స్వస్థి చెప్పవలసి వచ్చింది.

1953వ సంవత్సరంలో నాకు వివాహమైంది. జయమ్మ ఎల్లప్పుడు నాతో స్నేహంగా, సహాయకారిగా వుండేది. నేను ప్రసవించిన రెండుసార్లు ఆమె నా దగ్గర వుండి నాకు పరిచర్య చేసింది. నన్ను, నా పిల్లలను ఆమె ఎంతో బాగా చూసుకుంది. నా

భర్త శ్రీ యేసుదాసు డేవిడ్ విజయవాడలోని గవర్నమెంటు పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా 1960 నుండి 1970 వరకు పని చేసారు. ఆయనకు అకస్మాత్తుగా గుండెపోటు వచ్చి మరణించారు. ఆయన మరణించడం వలన నేను అసిస్టెంట్ నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పని చేసాను. తరువాత జమ్మలమడుగులోని కెంబెల్ ఆసుపత్రిలో నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పని చేసాను. మాకు అవకాశం



మరదలు శ్రీమతి రాజమ్మతో (కుడి వైపున) శ్రీమతి జయమ్మ

దొరికినప్పుడల్లా శ్రీమతి జయమ్మ మరియు నేను కలిసి ప్రార్థన చేసుకునేవారం. శ్రీమతి జయమ్మ దేవునియందు భయభక్తులుగల స్త్రీ. ఆమె అనుదినం బైబిలు చదివేది. ఆమె పేదవారిని ప్రేమించేది, వారి పట్ల దయ కలిగి వుండేది. అవసరతలో వున్న వారికి సహాయం చేసేది. **ఆమె ఎంతో సహనం గల స్త్రీ.** తన పిల్లలందరికీ దేవునికి విధేయులై వుండుటకు తర్ఫీదు యిచ్చింది. ఆమె భార్యగా, తల్లిగా తన పాత్రను శ్రేష్ఠంగా నెరవేర్చింది. మా అన్న చంపబడినప్పుడు, మేమిద్దరం ఆ సంఘటన స్థలానికి వెళ్ళాం. అప్పుడు ఆమె ఎంతో నిబ్బరంతో వుంది. తన గురించి ఇతరులు కలత చెందడం ఆమెకు యిష్టం ఉండేది కాదు. ఆమె దేవుని నడిపింపుకు విధేయత చూపింది. ఆమె ఎంతో విధేయురాలైన స్త్రీ. ఆమె విధవరాలైనప్పుడు ఏ హిందూ ఆచారాలు ఆచరించలేదు. తన భర్తను చంపిన వారి మీద పగ

తీర్చుకోవాలని ఆమె ఎన్నడు కోరలేదు. ప్రతి విషయం కొరకు ఆమె దేవుని మీద ఆధారపడింది.

ఒకరోజు ఆమె స్నానాల గదిలో పడిపోయి, చాల గంటలు స్పృహ కోల్పోయిన స్థితిలో వుంది. అప్పుడు మెదడు శస్త్రచికిత్స నిమిత్తం ఆమెను ఢిల్లీకి తీసుకొని వెళ్ళారు. ఢిల్లీలో ఆమె ఆసుపత్రిలో వున్నప్పుడు ఆమెను చూసుకునే అవకాశం నాకు దక్కింది. మరల 10 సంవత్సరాల తరువాత అదే రకమైన కష్టం ఆమెకు వచ్చింది. ఈసారి హైదరాబాదులోని అపోలో ఆసుపత్రిలో ఆమె బాగుపడలేదు. తరువాత దేవుడు ఆమెను తన సన్నిధికి తీసుకున్నాడు. ఆమె మరణానికి రెండు నెలలకు ముందు, ఆమె ఇంటికి రంగులు వేస్తున్నప్పుడు కొంత అనారోగ్యానికి లోనయింది. అప్పుడు నేను ఆమెను నా యింటికి తీసుకొని వెళ్ళాను. అక్కడ నాలుగైదు రోజులు ఆమెను పరామర్శించుటకు నాకు అవకాశం దొరికింది. 15-1-2006 తేదీన నాకు ఫోను చేసి "నేను స్నానానికి వెళ్తున్నాను, బాలికల జూనియర్ కళాశాలలో జరిగే సమాజ బైబిలు పఠనకు (సి.బి.యస్.) వెళ్దాం. నీవు కూడ సిద్ధపడు" అని చెప్పింది. నేను ఆమె స్వరం చివరి సారిగా వినడం అదే. తరువాత వెంటనే ఆమె స్నానాల గదిలో పడిపోయిందని, స్పృహ కోల్పోయిందని నేను విన్నాను. హైదరాబాదు అపోలో ఆసుపత్రిలో 10 రోజుల తరువాత దేవుడు ఆమెను తన సన్నిధికి పిలుచుకున్నాడు. ఆమె ఆసుపత్రిలో వున్నప్పుడు, ఆమె పక్షంగా ప్రతిరోజు ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ప్రస్తుతం ఆమె దేవుని సన్నిధిలో వుంది. అక్కడ ఆమె ప్రియులు, బంధువుల కొరకు విజ్ఞాపన చేస్తూ వుంది. ఆమె ఈ లోకంలో జీవించినంత కాలం ఎప్పుడు కూడ తన జీవనశైలి మార్చుకోలేదు. ప్రతి విషయాన్ని మరియు ప్రతి పరిస్థితిని సాధ్యమైనంత వరకు యథార్థంగా వుంచగలిగింది.

# శ్రీమతి ఎస్. కమలమ్మ

## శ్రీమతి జయమ్మకు చిన్న మరదలు



కమలమ్మ, రాజమ్మ, ఆమె సంతానం మరియు ఇంగ్లాండు నుండి వచ్చిన డా. కటింగ్‌తో శ్రీమతి జయమ్మ

మా నాల్గవ అన్న స్వర్గీయ శ్రీ వై. ఎస్. రాజారెడ్డిని జయమ్మ వివాహం చేసుకొనక ముందే ఆమె నాకు తెలుసు. ఆమె మా మేనత్త ఏకైక కుమార్తె. మద్రాసులోని బెంటిక్ బాలికల ఉన్నత పాఠశాలలో మా మూడవ అక్కతో కలిసి 10వ తరగతి వరకు చదివింది. మా అన్నను వివాహం చేసుకుంది. పులివెందులలోని ఉన్నత పాఠశాలలో 11వ తరగతి చదివి, వందమంది విద్యార్థుల్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణురాలైంది. ఆమె యింకా చదువుకోవాలని ఆశించింది గాని అప్పుడు ఆమెకు మొదటి కుమారుడు జన్మించుట వలన చదువు కొనసాగించలేక పోయింది. ఆ కుమారునికి జార్జిరెడ్డి అని పేరు పెట్టారు. మాది పెద్ద ఉమ్మడి కుటుంబం

కాబట్టి ఎన్నో పనులు వుండేవి. అందుచేత ఆమె పై చదువులకు ఇతర స్థలానికి వెళ్ళలేకపోయింది. ఆమెకు ఇంగ్లీషు మరియు లెక్కలు యిష్టమైన పాఠాలు. అవి ఆమెకు తరువాత అనుదిన కార్యకలాపాల్లో సహాయపడినాయి. తన భర్త అక్కాచెల్లెల్లమైన మా కందరికీ మంచి ఉన్నత చదువులు వున్నాయని ఆమె ఎన్నడు అసూయపడలేదు. ఆమె మమ్ములను గౌరవించింది. మాతో ఎల్లప్పుడు స్నేహంగా, సంతోషంగా వుండేది. ఆమెను నా అక్కలతో సమానంగా భావించి నేను ఆమెను జయక్క అని పిలిచేదానను గాని వదిన అని పిలవలేదు.

**"ఆయనను ప్రేమించువారు బలముతో ఉదయించు సూర్యునివలె నుందురు అని పాడిరి."** న్యాయాధిపతులు 5:31.

ప్రేమ, విధేయత, నమ్మకం, కష్టించి పనిచేసే స్వభావం, మర్యాద, దయ, గ్రహింపు, పరిశీలన, సంభాషణలో గౌరవ మర్యాదలు ఎల్లప్పుడూ శ్రీమతి జయమ్మలో కనిపించే గుణ లక్షణాలు. ప్రార్థనాభక్తి జీవితం ఆమె సొంతం. ఆమె ఎన్నడూ ఖరీదైన, ఆకర్షణీయమైన వస్త్రాలతోనూ, నగలతోనూ అలంకరించుకొనేది కాదు. విలాసవంతంగా జీవించాలని ఆమె ఎన్నడూ కోరలేదు. ఆమె నిరాడంబరతయే ఆమెకు అలంకరణ. ఆమె నమ్రత కలిగిన స్త్రీ మూర్తి. మా కుటుంబానికి ఆమె ఆశీర్వాదకరం.

ఆమె దైవోపదేశం ఎంతో ప్రశాంతంగా, దయతో, మర్యాదగా సాగిపోయేది. ఆమె సంభాషణ సందర్భానుసారంగా ఉండేది. ఆమె దేవుని బలిష్ఠమైన చేతుల క్రింద దీనురాలై ఉంది కాబట్టి ఆయన తగిన కాలమందు ఆమెను హెచ్చించాడు. ఇతరుల పట్ల ఆమె దీన మనస్సు కలిగి ఉండేది. " **ఆయన ఎక్కువ కృప నిచ్చును**

**అందుచేత - దేవుడు అహంకారులను ఎదిరించి దీనులకు కృప అనుగ్రహించును."** యాకోబు 4:6. **"నీతి మంతుని విజ్ఞాపన మనఃపూర్వకమైనదై, బహుబలము గలదై యుండును." అని లేఖనము చెప్పుచున్నది.** యాకోబు 5:16

> **"జ్ఞానము కలిగి తన నోరు తెరచును కృపగల ఉపదేశము ఆమె బోధించును"** సామెతలు 31:26.

శ్రీమతి జయమ్మ ఆమె భర్తను ప్రేమించింది. ఆయన కుటుంబ సభ్యులందరిపట్ల (భర్త తల్లిదండ్రులు, అక్కచెల్లెల్లు, బావబావమరుదలు, అన్నదమ్ములు, వదినా మరదళ్లు, వారి పిల్లలందరినీ) గౌరవ ప్రేమలతో నడుచుకునేది. అన్ని విషయాల్లో ఆమె భర్తకు లోబడేది. ఆయన రక్షణపొందాలని ఆశించేది. ఆయన పట్ల ఆమెకు ఎంతో గౌరవం వుంది. మా అన్న కూడ దానికి మారుగా ఆమె దైవభక్తి ప్రవర్తనను చూసి ఆమెను ఎంతో గౌరవించేవారు. ఆమె ఆదర్శవంతమైన భార్య. "నా భార్య చేసే ఎడతెగని ప్రార్థనల కారణంగా నేను క్షేమంగా, నిశ్చింతగా ఉండగలుగుతున్నాను" అని మా అన్న అంటూ వుండేవాడు. ఆమె పేదలకు తన చేతులు చాచి దానం చేసేది, అవసరతలో వున్న వారికి సహాయం చేసేది. బలమును, ఘనతయును ఆమెకు వస్త్రములు. ఆమె చాలా కష్టపడి పనిచేసేది. ఎంతో జ్ఞానంతో, సామర్థ్యంతో యింటి వ్యవహారాలు చక్కబెట్టుకునేది. ఆమె ఎన్నడూ పని చేయకుండా ఆహారం తినలేదు.

> **"దేవుడు తన్ను ప్రేమించువారికొరకు ఏవి సిద్ధపరచెనో అవి కంటికి కనబడలేదు, చెవికి వినబడలేదు, మనుష్య హృదయమునకు గోచరము కాలేదు"** 1 కొరింథీయులకు 2:9.

శ్రీమతి జయమ్మ దేవుని కొరకు ఆకలిదప్పులు కలిగిన స్త్రీ. ఆ కారణం చేతనే దేవుడు ఆమెను హెచ్చించాడు. ఇంట్లో ప్రతి ఒక్కరు సలహా కొరకు ఆమె దగ్గరకు వచ్చేవారు. శ్రమను భరించుటకు ఆమెకు గల ధైర్యానికి, సామర్థ్యానికి వున్న రహస్యం ఏమంటే ఆమె ప్రార్థనా జీవితం. ప్రపంచంలోని కలల్లో సాధించలేని అనేక కార్యాలు ప్రార్థన ద్వారా సాధించగలం. ఆమె కుటుంబం ఆమె చేసిన ప్రార్థన వలన దేవునిచే మార్చబడింది. తన రెండవ కుమారుడు డా. వై. ఎస్. రాజశేఖర్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కావాలని ఆమె ప్రార్థన చేసింది. ఆ విధంగా ఆయన ధనవంతుడు కావాలని, ప్రఖ్యాతి గాంచాలని కాదు గాని అతని ద్వారా పేదలు, అవసరతలో వున్నవారు సహాయం పొందాలని ఆమె కోరింది. దేవునికి సమస్తం సాధ్యం అని ఆమెకు తెలుసు గనుక దేవుని సమయం కొరకు ఓపికతో కనిపెట్టింది. తగిన సమయంలో ఆమె ప్రార్థనలకు మరియు విజ్ఞాపనలకు జవాబు వచ్చింది. **"యెహోవా నీ యింటికి వచ్చిన ఆ స్త్రీని ఇశ్రాయేలీయుల వంశమును వర్ధిల్లజేసిన రాహేలును పోలినదానిగాను లేయాను పోలినదానిగాను చేయును గాక"** రూతు 4:11.

**"యోగ్యురాలు తన పెనిమిటికి కిరీటము"** సామెతలు 12:4. శ్రీమతి జయమ్మ దయాహృదయం కలది. పేదలు మరియు అభాగ్యుల పట్ల కనికరం కలిగి వుండేది. ఆమెది సున్నిత మనస్తత్వం, ఇతరులను గౌరవించే స్వభావం. ఈ లక్షణాలు గల ఆమె అంతరంగ సౌందర్యం ధరించి దేవుని దృష్టిలో ఎంతో విలువైన వ్యక్తిగా మారింది. దేవునికి ఆమె విధేయత చూపిన కారణంగా, ఆమె కుటుంబ సభ్యులు దేవునితో సరైన సంబంధంలోకి వచ్చుటకు ఆయన ఆమెను వాడుకున్నాడు.

(దాదాపు ఆమె కోడళ్ళందరు వివాహానికి ముందు క్రైస్తవులు కాదు). ఆమె కుటుంబ సభ్యుల్లో దాదాపు ప్రతి ఒక్కరు రక్షణలోకి నడిపించబడినారు. ఆమె మంచి గృహనిర్వాహకురాలు.



భర్త తోబుట్టువులతో శ్రీమతి జయమ్మ, శ్రీమతి కమలమ్మ (కుడి వైపున)

**"అందుకు రూతు--నా వెంబడి రావద్దనియు నన్ను విడిచి పెట్టుమనియు నన్ను బతిమాలుకొనవద్దు. నీవు వెళ్ళు చోటికే నేను వచ్చెదను, నీవు నివసించుచోటనే నేను నివసించెదను, నీ జనమే నా జనము నీ దేవుడే నా దేవుడు"** రూతు 1:16.

నయోమి మాదిరి జీవితం, ఆమె దైవభక్తి, విశ్వాసం గమనించుట వలన రూతు కూడా స్థిరమైన విశ్వాసిగా మారింది. అందువలన నయోమిని ప్రేమించుటలో రూతు నమ్మకంగా ఉంది. ఈ విషయం జయక్క గృహంలో కూడ సంభవించింది. జయక్క కోడళ్లందరూ కూడా రూతు వలె తమ అత్తను అనుసరించారు.

శ్రీమతి జయమ్మ దేవుడైన ప్రభువును ప్రేమించింది, ఆయన మార్గంలో నడిచింది, ఆయనను వెంబడించింది. ఆమె మంచి గుణలక్షణాలు కలిగిన భార్య. ఆమె జీవితమంతా దేవుని భయంతో కేంద్రీకృతమై వుండేది. ఆమె ప్రతిరోజు తెల్లవారుజామున 4.00 గంటలకు లేక 4.30 గంటలకు లేచి తన కుటుంబ సభ్యుల అవసరతలు తీర్చేది. ఆమె ఇంట్లో పనివారిని, అదే విధంగా పొలంలో వున్న కూలీలను ప్రేమించింది. వారి అవసరతలను ఆమె ఎల్లప్పుడు గమనించి, నెరవేరుస్తూ వుండేది.

**"యెహోవా హన్నాను దర్శింపగా..."** (1 సమూయేలు 2:21).

రైతు, కాంట్రాక్టరు, బస్సు యజమాని, గనుల యజమాని భార్యగా, పంచాయితీ అధ్యక్షురాలిగా ఆమె దేవుని పట్ల లేక ఇతరుల పట్ల తన వైఖరి ఏ మాత్రం మార్చుకోలేదు. ఆమె పులివెందుల పంచాయితీ అధ్యక్షురాలిగా 5 సంవత్సరాలు ప్రజాసేవ చేసి ప్రభుత్వ ఉత్తమ సేవా అవార్డు అందుకుంది. ఆ హోదాను బట్టి ఆమె ఏ మాత్రం గర్వపడలేదు. శాసనసభ సభ్యుని, లోక్‌సభ సభ్యుని తల్లిగా, మంత్రి, ప్రతిపక్ష నాయకుని తల్లిగా, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మరియు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి తల్లిగా ఆమె ఎంత మాత్రం గర్వపడలేదు. ఆమె అన్ని సమయాల్లో దీనురాలుగానే వుంది. ఆమె దేవునికి దశమభాగం చెల్లించుటలో చాల ఖచ్చితంగా వుండేది. దేవుడు ఆమెకు, ఆమె కుటుంబ సభ్యులకు అనుగ్రహించిన ఆశీర్వాదాలన్నిటి నిమిత్తం ఆయన పట్ల కృతజ్ఞత కలిగి వుండేది. ఆమె భర్త, ఆమె పిల్లలు లేక ఇతరులు బయటకు (ఇంటి నుండి బయటకు) వెళ్ళేటప్పుడు వారిని ప్రార్థనతో మరియు ఆశీర్వాదంతో పంపేది.

భవనంలో లేక గుడిసెలో జరిగే ప్రతి ప్రార్థన కూడికకు ఆమె హాజరవుతూ వుండేది. ఏ ఆహ్వానానికైనా ఆమె రాను అని ఎన్నడు చెప్పలేదు. దేవుని సేవకుల అవసరతలు గౌరవించేది, వాటిని తీర్చేది.

> **"తాను జరిగించిన క్రియల చొప్పున అవి మంచివైననూ సరే చెడ్డవైననూ సరే దేహముతో జరిగించిన వాటి ఫలము పొందునట్లు మనమందరము క్రీస్తు న్యాయపీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును."** 2 కొరింథీయులకు 5:10.

దేవునియందు భయభక్తులుగల స్త్రీ కొనియాడబడును. శ్రీమతి జయమ్మ స్త్రీలందర్నీ అధిగమించింది. ఆమె భక్తి జీవిత విధానం బట్టి మనం ఆమెను గౌరవించాలి. ఆమె ఆలయానికి క్రమంగా వెళ్ళేది. స్త్రీల సహవాస కార్యక్రమాల్లో పాల్గొనేది. ప్రభుత్వం నిర్వహించిన సామాజిక కార్యకలాపాల్లో కూడ పాలుపంచుకొనేది. ఆమె ఆంధ్ర క్రైస్తవ కీర్తనలు చాలా బాగా పాడేది. బైబిలు గ్రంథం గురించిన మంచి జ్ఞానం ఆమెకు వుంది. నేను ఎప్పుడైనా నా సందేహాలను ఆమెకు తెలియజేసినప్పుడు ఎంతో సహనంతో జవాబిచ్చేది. ఆమె గృహంలో నేను వున్నప్పుడు నా యింట్లో వున్నట్లే భావించేదానను. ప్రతి విషయంలో ఆమె నాకు ప్రాముఖ్యత యిచ్చింది. జయక్క ప్రశాంతంగా దేవుని సన్నిధికి చేరినందుకు ఆయనకు వందనాలు చెల్లిస్తున్నాను. రక్షకునియందు ఆమెకు వున్న విశ్వాసం మరియు నమ్మకమును బట్టి ఆయనకు వందనాలు చెల్లిస్తున్నాను.

# శ్రీమతి సరస్వతి రెడ్డి

## శ్రీమతి జయమ్మ స్నేహితురాలు



సరస్వతమ్మ మరియు సరోజనమ్మతో శ్రీమతి జయమ్మ

**"నా అడుగుల లెక్క ఆయనకు తెలియజేసెదను, రాజు వలె నేనాయనయొద్దకు వెళ్ళెదను"** యోబు 31:37. శ్రీమతి జయమ్మ ఈ వచనం ప్రకారం జీవించింది. ప్రస్తుతం ఆమె తన నిత్యలోకంలో సంతోషంగా వుంది. శ్రీమతి జయమ్మ లోని ఉన్నతమైన ప్రవర్తన గొప్పతనం వర్ణించుటకు మాటలు చాలవు. ఆమె క్రీస్తుతో సన్నిహిత సహవాసం కలిగి వుంది, దేవుని

వాక్య ప్రకారం జీవించింది. దేవుని వాక్యమందు ఆమెకు గొప్ప విశ్వాసం వలన ప్రతి పరిస్థితిలో ఆమె వాక్యాన్ని ఉపయోగించేది. ప్రతి సందర్భంలో దేవుని వాక్యాన్ని ప్రస్తావించేది. ఆమె వృద్ధాప్యంలో ఎంతో బలహీనంగా వున్నప్పటికీ పాఠశాలకు వెళ్ళే బాలిక వలె చేతిలో పుస్తకం పట్టుకొని సమాజ బైబిలు పఠన తరగతులకు వెళ్తూ వుండేది. ఆ తరగతుల్లో వేసే ప్రతి ప్రశ్నకు సమాధానం యివ్వడానికి ప్రయత్నించేది.

1 థెస్సలొనీకయులకు 5:17లో **"యెడతెగక ప్రార్థన చేయుడి."** అని వ్రాయబడిన ప్రకారం కుటుంబం, బంధువులు మరియు సంఘాల అభివృద్ధి కొరకు ఆమె ప్రార్థిస్తూనే వుండేది. ఆమె చేసిన ప్రార్థనల ఫలితంగా ఆమె పిల్లలందరు రక్షణపొందారు, వారు ఆత్మీయంగా ఎంతో ఎదిగారు. ప్రతి విషయం నిమిత్తం ఆమె ప్రార్థన మీద ఆధారపడేది.



యు.ఇ.ఎస్.ఐ. పరిచర్యలో శ్రీమతి జయమ్మ

ఆమె విశ్వాసం చాల బలమైంది. ఆమె ఎన్నడు డబ్బుకు ప్రాధాన్యత యివ్వలేదు. ఈ వచనాన్ని ఆమె విశ్వసించింది. **"అయితే నేను దేవుని నాశ్రయించుదును. దేవునికే నా వ్యాజ్యెమును అప్పగించుదును"** యోబు 8:5.

ఆమె మంచి ఆతిథ్యము యిచ్చుటలో ఎన్నడు అలసిపోలేదు. **"పరదేశిని వీధిలో ఉండనియ్యక నా యింటి వీధితలుపులు తెరచితిని గదా"** యోబు 31:32. అను బైబిలు వచన ప్రకారం ఆతిథ్యం యిచ్చుటకు ఆమె ఎల్లప్పుడు తలుపులు తెరచి వుంచేది. బంధువులు, స్నేహితులు, రోగులు, పేదలు, బోధకులు, మరియు శ్రేయోభిలాషులు మొదలైన వారందరికీ ఒకే రకమైన ఆహ్వానం వుండేది. ఆమె వారికి ఆహారం పెట్టేది, అవసరతలో వున్న వారికి సహాయం చేసేది. ఆమె రోగులను ఆసుపత్రికి పంపించి, వారికి ఉచితంగా వైద్యం చేయించేది. అంతటి దీనత్వం నేను ఎవ్వరిలోనూ చూడలేదు.

**"ఇందు విషయమై అతడు వెదజల్లి దరిద్రులకిచ్చెను అతని నీతి నిరంతరము నిలుచును అని వ్రాయబడియున్నది"** 2 కొరింథీయులకు 9:9 శ్రీమతి జయమ్మ ఎల్లప్పుడు ఇతరులకు సహాయం చేసింది గాని వారి నుండి తిరిగి ఏమీ ఆశించలేదు.



ఈ దృశ్యంలో ఆమె దీనత్వం ప్రధానంగా కనిపిస్తూ ఉంది

ఆమె పనివారిని ఎంతో బాగా చూసుకునేది. కొలొస్సయులకు 4:1లో వ్రాయబడిన దేవుని వాక్యాన్ని అనుసరించింది. **"యజమానులారా, పరలోకములో మీకును యజమానుడున్నాడని యెరిగి, న్యాయమైనదియు ధర్మానుసారమైనదియు మీ దాసుల యెడల చేయుడి."**

ప్రతి విషయంలో శ్రీమతి జయమ్మ దేవుని దృష్టిలో నిందారహితంగా జీవించింది. చివరిగా తన అశాశ్వత ఇహలోక జీవితం ముగించి తన పరలోకపు తండ్రిని చేరుకుంది.

# ఆచార్య వసంత్ జోసెఫ్

శ్రీమతి జయమ్మ చిన్ననాటి సోదర స్నేహితుడు

సోదరి జయమ్మ నిస్సందేహంగా క్రీస్తును తన జీవితంలో కేంద్రంగా వుంచుకున్న వ్యక్తి. ఆమె అనుదిన జీవితం ప్రభువునందు ఆమె విశ్వాసాన్ని ప్రతిబింబింపజేసేది. చక్కని ఆదర్శవంతమైన మహిళ అని కూడ ఆమెతో సన్నిహితంగా వున్నవారు ఖచ్చితంగా చెప్పగలరు. పులివెందులలోని దక్షిణఇండియా సంఘం (సి.ఎస్.ఐ.) యొక్క స్త్రీల సహవాసానికి గొప్ప బలమైన స్థంబంగా వుండేది.



స్త్రీల సహవాస సభ్యులతో శ్రీమతి జయమ్మ

అన్నిటికీ మించి శ్రీమతి జయమ్మ గొప్ప ప్రార్థనాపరురాలు. **అనుదినం బైబిలు చదవడం మరియు లేఖనాలు ధ్యానించడం ఆమెకు అలవాటు.** అవసరతలో వున్న వారికి ఆమె సహాయం చేసే సమయంలో ఆమె నిరాడంబరత, దీనత్వం కనబడేవి. ఆమెకు ఏ విధమైన కులపట్టింపు వుండేది కాదు.

శ్రీమతి జయమ్మ జీవితం ఆమె కుటుంబ ఐక్యతకు చిహ్నం. ఆమె జీవితం మన ప్రభువుకు గొప్ప సాక్ష్యం. ఆమెకు అసామానమైన క్రైస్తవ జీవిత విలువలు ఉండేవి.



వసంత జోసఫ్‌తో శ్రీమతి జయమ్మ

ఆమె భర్త కీ.శే. శ్రీ వై. ఎస్. రాజారెడ్డి తన భార్య శ్రీమతి జయమ్మ ఈ వాక్యాన్ని అనుసరించి ఉంటుందని చెప్తూ ఉండేవారు. **"గుణవతియైన భార్య దొరుకుట అరుదు. అట్టిది ముత్యముకంటె అమూల్యమైనది. ఆమె పెనిమిటి ఆమెయందు నమ్మియుంచును అతని లాభప్రాప్తికి వెలితి కలుగదు. ఆమె తాను బ్రదుకు దినములన్నియు అతనికి మేలు చేయును గాని కీడేమియు చేయదు."** సామెతలు 31:10-12.

**"యెహోవాయందు భయభక్తులు కలిగిన స్త్రీ కొనియాడబడును"** సామెతలు 31:28-30. ఆమె భర్త, పిల్లలు ఆమె జీవితం ఈ బైబిలు వాక్యానికి అనుగుణంగా ఉండేదని అభినందించేవారు. ఏ క్రైస్తవుడైనా, క్రైస్తవురాలైనా ఈ ప్రాముఖ్యమైన

ఆజ్ఞను నెరవేర్చాలి. **"నిన్నువలె నీ పొరుగువానిని ప్రేమింపవలెననునదియే"** మార్కు 12:31. శ్రీమతి జయమ్మ, మా తల్లిదండ్రులు (కీ.శే. రెవ. మరియు శ్రీమతి సత్యా జోసఫ్), జయమ్మ తల్లి మరియమ్మ ఈ వాక్య ప్రకారం ప్రవర్తించారు. ప్రస్తుతం నాతో పాటు పులివెందుల వాస్తవ్యులు వెంకటరెడ్డి కుటుంబ సభ్యుల్లో అనేకులు ఈ వాక్యానుసారంగా జీవించడానికి శాయశక్తులా కృషిచేస్తున్నాము.

**"కాగా విశ్వాసము, నిరీక్షణ, ప్రేమ యీ మూడును నిలుచును వీటిలో శ్రేష్ఠమైనది ప్రేమయే"** 1 కొరింథీయులకు 13:13 అనే విషయాన్ని శ్రీమతి జయమ్మ తన జీవితంలో ఋజువు చేసింది.

దేవుని సృష్టి నిమిత్తం ప్రేమను అర్థం చేసుకొనుటలో, ఆచరించుటలో ఆమె దీనత్వం కలిగి వుంది.

జార్జి, రాజశేఖర్, వివేకం, విమల, సుధీకర్, రవీంద్రనాథ్ మరియు వారి కుటుంబాలు జయమ్మ తల్లి అని, అత్త అని, మామ్మ అని సాక్ష్యమిస్తున్నారు. ఇటువంటి వ్యక్తులు గల కుటుంబం అరుదు.

**"ఆ స్వర్గ పంక్తి జేరి యానందమొందుచున్**

**యీ సంఘ మేసుఁగూడి విశ్రాంతి పొందును"**

-ఎస్. జె. స్టోన్, 1939-1900

# రెవ. ఎమ్. థియోఫిలస్

డివిజనల్ మాజీ అధ్యక్షులు

రెవ. ఎమ్. థియోఫిలస్

నేను పులివెందుల సి.యస్.ఐ. సంఘ డివిజన్‌లో 23 సంవత్సరములు పరిచర్య చేసి పదవీ విరమణ తరువాత సంఘ సభికుల ప్రేమను బట్టి మరి మిక్కిలి వై. ఎస్. కుటుంబికుల ప్రేమను బట్టి, ప్రభువైన యేసుక్రీస్తు అపారమైన కృపను బట్టి పులివెందుల పట్టణములో స్థిరపడియున్నాను.



రెవ. మరియు శ్రీమతి థియోఫిలస్ మరియు హెలీనమ్మతో మా తల్లి

సంఘములో, స్త్రీల మైత్రిలో పెద్దామె శ్రీమతి వై. ఎస్. జయమ్మ గారి స్త్రీల మైత్రిలో పాత్రను గురించి ఆమె క్రైస్తవ జీవితమును గురించి కొన్ని మాటలు వ్రాయుచున్నాను.

క్రైస్తవ సంఘములో క్రైస్తవులు అనేకులు తమ అనుదిన జీవితానికి తాము పాటించే మత విశ్వాసమునకు ఏలాంటి

సంబంధం లేనట్టుగా జీవిస్తూంటారు. వారి విశ్వాసం వారి జీవితాల్లో అంతర్భాగంగా వుండదు. అందునుబట్టి వారి జీవితాలు అర్థవంతంగా, ఫలవంతంగా, ఆదర్శవంతంగా వుండవు. అవి అందరికి స్ఫూర్తిదాయకం కావు. పెద్దామె యేసునందలి విశ్వాసముంచి, ఆయన సందేశాలకు మరియు ఆమె అనుదిన జీవితానికి చాల దగ్గర సంబంధము కలిగి జీవించింది. అందునుబట్టి ఆమె అనేకులకు స్ఫూర్తి నిచ్చింది.



కృతజ్ఞతా గృహకూడికలో మా తల్లి దైవ సందేశం

పెద్దామె జయమ్మగారు యేసుక్రీస్తును కలిగిన బలమైన విశ్వాసి. పరిశుద్ధ బైబిలు గ్రంథమును పఠించిన, ధ్యానించిన, అనుసరించిన వ్యక్తి. **ఆమె ఆత్మయందు జీవించిన వ్యక్తి. ఆత్మఫలమైన ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వికము, ఆశానిగ్రహము గల భక్తిపరురాలు.** ఆమె విశ్వాసం ఆమె కుటుంబానికి మూలం. అమ్మ ప్రార్థనలు ఆమె కుటుంబముపై దైవాశీస్సులను వర్షింపజేసాయి. తన సంతానానికి ఆమె దేవుని వరం, కొండంత అండ. ఆమె ప్రేమ వారికి అమృతమయం. ఆమె సంతానానికంతటికి ఆమెకు సమానమైన గురువుగానీ మిత్రులుగానీ లేరు. ఆమె ధన్యజీవి.

పెద్దామె సానుభూతి కులాతీతమైనది. ఆమె అందరి క్షేమం కోరే వ్యక్తి. గురువులను, దైవసేవకులను ప్రేమించి గొప్పగా, దండిగా సహాయం చేసేది. నన్ను, నా భార్య క్యాతరిన్‌ను, మా పిల్లలైన గీతను, పీటర్‌ను బహుగా ప్రేమించి మేము ఊహించలేనంత సహాయం మా కుటుంబానికి చేసింది. మమ్ములను గురించి బాధపడేది. ఆమెను మేము మరువలేము. ఆమెను బట్టి దేవునికి స్తోత్రాలు చెల్లించాము. ఆమె సంతానం కొరకు ప్రార్థిస్తున్నాము.

యేసుక్రీస్తునందలి విశ్వాసమును బట్టి ఆమెకు నిత్యజీవమున్నదని నేను నమ్ముచున్నాను. అక్షయమైన దేవుని గుడారములో చిరకాలము ఆమె నివసిస్తుంది. దేవుని సన్నిధిలో ఆమె ప్రార్థనలు ఆమె సంతానానికి ఎల్లప్పుడు వుండునన్నది నా విశ్వాసం. దేవుడు ఆమె ఆత్మకు నిత్యశాంతి, నిత్యవెలుగు ప్రసాదించును గాక. ఆమేన్.



శ్రీమతి జయమ్మ మరదలు శ్రీమతి సుగుణమ్మ
డి.ఇ.వో పదవీ విరమణసందర్భంగా

# శ్రీ ఎం. రామసుబ్బన్న

16 సంవత్సరాలు శ్రీమతి జయమ్మతో
పరిచయం వున్న వ్యక్తి

ఎం. రామసుబ్బన్న

**"భక్తిగల స్త్రీ కొనియాడబడును"** సామెతలు 31:30

సర్వశక్తిగల దేవుడు తన స్వరూపమందు నరుని సృజించెను. అతనికి సాటియైన సహకారిగా వుండుటకు స్త్రీని సృజించెను. స్త్రీ సాటియైన సహకారియే గాని పోటీయైన సహకారి కాదు. స్త్రీ సహకారియే గాని అధికారి కాదు. ప్రతి గొప్ప వ్యక్తి వెనుక ఒక స్త్రీ వుంటుంది. స్త్రీ తన జీవితములో ఒక కుమార్తెగా, కోడలుగా, భార్యగా, తల్లిగా, అత్తగా, అమ్మమ్మగా వివిధ రకాల బాధ్యతలు నిర్వర్తించవలసి వుంది.



నాలుగు తరాలు (శ్రీమతి వై.ఎస్. జయమ్మ, కుమార్తె, మనుమరాలు, మునిమనుమరాలు)

వీటన్నిటి కంటె మిక్కుటముగా దేవుని కుమార్తెగా దైవభక్తితో, సద్గుణశీలియై వినయ విధేయతలతో కొనియాడబడుచు దేవుని ఇంటికి, తన యింటికి ఎనలేని ఖ్యాతిని తీసుకొని రావలసిన బాధ్యత కూడ ఆమె మీద వున్నది. ఈ సందర్భముగా ఒక ఆదర్శ మహిళగా, ఆత్మీయురాలిగా అందరి మన్ననలు పొందిన దైవజనురాలైన శ్రీమతి వై. ఎస్. జయమ్మ రాజరెడ్డి గారిని గురించి సాక్ష్యమిచ్చుటకు ఎంతగానో సంతోషించుచున్నాను.

మన రాష్ట్ర ముఖ్యమంత్రి వై. ఎస్. రాజశేఖర్ రెడ్డి గారి తల్లిగారైన శ్రీమతి జయమ్మ గారితో 1991వ సంవత్సరము నుండి నాకు పరిచయము. ఆమెతో పరిచయము దేవుడు నాకిచ్చిన గొప్ప ధన్యతగా భావించుచున్నాను. శ్రీమతి వై. ఎస్. జయమ్మ గారు ఒక అసమానమైన వ్యక్తిగా, ఆదర్శమహిళగా పులివెందులలో అందరికి సుపరిచితురాలు. ఆమెను గురించి తెలియనివారు వుండరని చెప్పుటలో అతిశయోక్తి లేదు. దేవుడు ప్రసాదించిన జీవితమును ప్రభువైన యేసుక్రీస్తుకు సమర్పించుకోవడమే గాక, వాక్యానుసారంగా మాదిరికరమైన రీతిలో జీవించిన ఆత్మీయురాలు. ఆమె జీవితము ఒక సంచార పరిశుద్ధ గ్రంథం. అనేకమంది ఆమె జీవితము చూచి వాక్యము లేకుండానే ప్రభువును అంగీకరించినవారు పులివెందులలో వున్నారు. ఆమె క్రీస్తు మనస్సు కలిగి జీవించిన ధన్యురాలు.

ఆమె చేతిలో బైబిలు లేకుండ ఆమెను ఊహించలేము. మానవత్వమే ఆమె మతము. వాక్య ధ్యానము ఆమె జీవనము. ప్రార్థనయే ఆమె ఊపిరి. ఆతిథ్యమివ్వడమే ఆమె అలవాటు. అవసరతలో వున్న వారికి సహాయం చేయుట, క్షమించి ప్రేమించుట ఆమె స్వభావం. తన యింటిని జ్ఞానముతో కట్టుకొనిన

ప్రార్థనాపరురాలు. తన పిల్లల జీవితాల్లో బైబిలు కథలు, వాక్యాలతో క్రీస్తునుగూర్చిన పునాది ఆమె వేసింది. దేవుడు ఆమెకు బహుమానముగా ప్రసాదించిన ఐదుగురు కుమారులను, ఏకైక కుమార్తె శ్రీమతి విమలమ్మ గారిని క్రైస్తవ విలువలతో పెంచిన తల్లి.

స్థానిక సంఘములో అనేకమందికి ఆమె ప్రోత్సాహకరంగా ఉండెడిది. స్థానికంగా సి. యస్. ఐ. సంఘమునకు చెందినప్పటికిని ఏ సంఘములోనైనా ప్రత్యేక కూడికలు గాని, గృహకూడికలు గాని వుంటే తప్పక హాజరయ్యేడివారు. సంఘ కార్యక్రమములకు తనతో పాటు ఇతరులను కూడ సిద్ధపరచి తీసుకొని వెళ్ళెడి అలవాటుగలవారు. ఏ కార్యక్రమునకైనా సకాలంలో హాజరై, దైవభక్తితో వాక్యం విని, అందరిని పలకరించి వెళ్ళెడివారు. ఆమె అచంచల విశ్వాసము వలన అనేక శ్రమలు, ఇబ్బందుల నుండి ఆమె తప్పించబడ్డారు. ప్రభువు ఆమె కుటుంబాన్ని భద్రపరచి, ఆమె కుమారులను అనేక భయంకర ప్రమాదాల నుండి కాపాడారు.



శ్రీమతి జయమ్మ మునిమనమలు

ఒకరోజు నేను కళాశాల నుండి ఇంటికి వెళ్తూ వుండగా శ్రీమతి జయమ్మగారు, పులివెందుల ఎం.ఆర్.ఒ. కార్యాలయం ఎదురుగా నిరాహారదీక్షలో వున్న మహిళలకు బైబిలు పట్టుకొని వాక్యాన్ని ప్రకటిస్తూ కనిపించారు. ఆ సన్నివేశాన్ని చూచిన నేను అడుగు ముందుకు వేయలేకపోయాను. నన్ను ఎంతగానో కదిలించివేసిన మరువలేని సన్నివేశము అది. ఎందుకంటే ఎంతోమంది వారికి మద్దతు ప్రకటించవచ్చు, జాలి చూపించవచ్చునేమో గాని ఆమె అయితే క్రీస్తు యేసే సమస్త సమస్యలకు జవాబు అని ధైర్యంగా ప్రకటించారు.

యు.ఇ.ఎస్.ఐ. పరిచర్యలో భాగంగా శిష్యత్వపు శిక్షణా శిబిరం, శ్రీ వై. ఎస్. వెంకటరెడ్డి మెమోరియల్ జూనియర్ కళాశాలలో జరుపుకొనుటకు అనుమతినిచ్చారు. ఆ కాలేజి ప్రిన్సిపాల్ గారైన శ్రీమతి ఎస్. కమలమ్మ గారు ఊరిలో లేరు. ఒకరోజు రాత్రి భోజనము సిద్ధము చేయుచుండగా మధ్యలో వంటగ్యాస్ అయిపోయింది. విద్యుత్తు సరఫరా ఆగిపోయింది. అప్పుడు భారీవర్షం కురుస్తూ వుంది. దిక్కుతోచని స్థితిలో శ్రీమతి జయమ్మ గారికి ఫోను ద్వారా మా అవసరతను గురించి తెలియజేయగా వెంటనే ఆమె స్వయంగా గ్యాస్ సిలిండర్ తన కారులో వేసుకొని వచ్చారు. ఇలా అవసరతలో వున్న వారికి తగిన రీతిలో స్పందించి సహాయపడిన దానగుణశీలి. ఇందులో విశేషము ఏమంటే ఆ దినాలలో పులివెందులలో గ్యాస్ డీలర్లు లేరు. కడప నుండి మాత్రమే గ్యాస్ సిలిండరు తెచ్చుకొనేవారు. తమ పిల్లల క్షేమము కంటే దేవుని పిల్లల క్షేమము ముఖ్యమని తలంచిన వ్యక్తి. త్యాగమనేది దేవుని నుండి పొందుకునే సుగుణం. స్వార్థమనేది దేవునికి విరోధమైనది.

పరిశుద్ధ గ్రంథంలో దైవజనుడైన మోషేను ఇశ్రాయేలీయులకు నాయకునిగా ప్రతిష్ఠించడానికి తన తల్లియైన యోకెబెదు పాత్ర చాల గొప్పది. ఆలాగే మన రాష్ట్రానికి గొప్ప నాయకులైన డా. వై. ఎస్. రాజశేఖర్ రెడ్డి గారు ముఖ్యమంత్రి స్థాయి చేరుటకు, శ్రీ వై. ఎస్. వివేకానంద రెడ్డి గారు కడప పార్లమెంటు సభ్యుని స్థాయి చేరుటకు ఆమె ప్రోత్సాహం, ప్రార్థన ప్రధాన కారణం. ప్రజలకు ఏమైనా మేలు చేయండి అని తన కుమారులతో పదే పదే చెప్పుచుండేవారు.

అమెరికా దేశపు ప్రథమ అధ్యక్షుడు జార్జి వాషింగ్టన్ గారు "విధేయత" అనేది మా తల్లి చిన్ననాటి నుండి నేర్పింది అన్నాడు. అందుకేనేమో శ్రీమతి జయమ్మ గారి సంతానం ఐదుగురు కుమారులను గాని, ఏకైక కుమార్తెను గాని గమనిస్తే **వారిలో తగ్గింపు స్వభావం బయలుపడుతుంది**. వాక్యములో వున్నట్లు తన్ను తాను తగ్గించుకొనువాడు హెచ్చింపబడును, తన్ను తాను హెచ్చించుకొనవాడు తగ్గింపబడును. మన గౌరవ ముఖ్యమంత్రి డా. వై. ఎస్. రాజశేఖర్ రెడ్డి గారు దైవభయము కలిగిన క్రైస్తవ నాయకుడు. దేవుణ్ణి, దేవునిగా ఘనపరచే వ్యక్తి. తన దైనందిన కార్యక్రమములను ప్రార్థనతో ప్రారంభించి, ప్రార్థనతో ముగించే అలవాటు కలిగిన ప్రార్థనాపరుడు. అన్నిటిలో దేవునికి ప్రథమ స్థానమునిచ్చి దేవుని నామమును బహుగా హెచ్చించినవారు. ఎందుకంటే ఆయన ముఖ్యమంత్రి అయిన తరువాత మొట్ట మొదటిసారిగా నూతన సంవత్సరమును జరుపుకొనుటకు గాను 2005వ సంవత్సరం జనవరి 1వ తేదీన ఉదయముననే అనేకమంది అధికారులు, మంత్రులు శుభాకాంక్షలు తెలియజేయుటకు వచ్చినప్పటికినీ మొదట దేవుని సన్నిధిలో కుటుంబంతో ప్రార్థనలో గడిపిన తరువాతనే మిగతా కార్యక్రమములకు వెళ్ళారు.

డా. వై. ఎస్. రాజశేఖర్ రెడ్డి గారు తన రాజకీయ జీవితంలో ఎప్పుడు కూడ క్రైస్తవ దేవాలయాల్లో ప్రవేశించి ఓటు వేయమని అడుగలేదు. అంటే దేవుని పరిశుద్ధతను, ఘనతను, ఆయన సన్నిధిని గౌరవించే స్వభావముగలవారు. 'మదర్స్‌డే' సందర్భంగా విలేకరుల సమావేశములో మాట్లాడుతూ **ఆయన విజయానికి కారణం కేవలం తన స్వయంకృషి కాదు గానీ తన తల్లి శ్రీమతి జయమ్మ గారి ప్రార్థన, తన సతీమణి విజయమ్మగారి మద్దతు, తన కుమార్తె షర్మిళమ్మగారి ప్రోత్సాహం** అని అన్నారు. అంటే తన జీవితమును తీర్చిదిద్దుటలో తన తల్లి గారి పాత్ర ఎంత ప్రాముఖ్యమైనదో అర్థం అవుతుంది. జన్మను యివ్వటమే గాక జీవితమును తీర్చిదిద్దిన తల్లిగారు ఆమె.

నాకున్న అనేక సంవత్సరాల అనుబంధంలో నేను ఎప్పుడు కూడ విగ్రహారాధనను గాని, లోకాచారములు గాని ఆమె ఇంటిలో చూడలేదు. నీతిమంతులు పిల్లల పిల్లలను చూచెదరనెడి వాక్య ప్రకారం శ్రీమతి వై. ఎస్. జయమ్మగారు నాలుగు తరాల వ్యక్తులను తన కుటుంబంలో చూసారు. ఆలాంటి నీతిమంతురాలు దేవుని పిలుపునందుకొని 25.01.2006న ఆయన సన్నిధికి చేరారు. ఆమె భూస్థాపన కార్యక్రమము ద్వారా కూడ దేవుడు ఎంతగానో మహిమపరచబడినాడు. ఎంతోమంది నాయకులు, అధికారులు మరియు ప్రజలు దేవుని వాక్యమును విని ఆత్మీయ మేలు పొందారు. ఆలాంటి నీతిమంతురాలును, యేసుప్రభువు తన మహిమతో వచ్చునప్పుడు మనమందరము మధ్యాకాశములో కలుసుకుంటామనే శుభప్రదమైన నిరీక్షణతో ఆమె చూపించిన బాటలో జీవించి అనేకమందిని ప్రభువు చెంతకు నడిపించుదాం.

**ప్రభువునందు మరణించినవారు ధన్యులు.** 1 కొరింథీ 15:22


# యేసు క్రీస్తు దైవత్వం

కొలొస్సయులకు 1:15-18 2:9

"ఆయన (యేసుక్రీస్తు) అదృశ్యదేవుని స్వరూపియై సర్వసృష్టికి ఆదిసంభూతుడై యున్నాడు. ఏలయనగా ఆకాశమందున్నవియు భూమియందున్నవియు, దృశ్యమైనవిగాని, అదృశ్యమైనవిగాని, అవి సింహాసనములైనను ప్రభుత్వములైనను ప్రధానులైనను అధికారములైనను, సర్వమును ఆయనయందు సృజింపబడెను, సర్వమును ఆయనద్వారాను ఆయననుబట్టియు సృజింపబడెను. ఆయన అన్నిటికంటె ముందుగా ఉన్నవాడు ఆయనే సమస్తమునకు ఆధారభూతుడు. సంఘము అను శరీరమునకు ఆయనే శిరస్సు ఆయన అన్నిటిలో ప్రాముఖ్యము కలుగు నిమిత్తము, ఆయన ఆదియైయుండి మృతులలోనుండి లేచుటలో ఆదిసంభూతుడాయెను. ఏలయనగా దేవత్వము యొక్క సర్వపరిపూర్ణత శరీరముగా క్రీస్తునందు నివసించుచున్నది."

ప్రభువు సదా మీకు తోడైయుండును గాక!


# శ్రీమతి జయమ్మ కుటుంబ సభ్యులు




జ్యేష్ఠకుమారుడు వై.ఎస్. జార్జిరెడ్డి సంతానం



రెండవ కుమారుడు డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి కుటుంబం



మూడవ కుమారుడు
శ్రీ వై.ఎస్. వివేకానందరెడ్డి కుటుంబం



కీ.శే. శ్రీ బి. కుమార్ కోటిరెడ్డి
(అల్లుడు)



కుమార్తె శ్రీమతి విమలారెడ్డి కుటుంబం



నాల్గవ కుమారుడు శ్రీ వై. ఎస్. సుధీకర్ రెడ్డి కుటుంబం




కనిష్ఠ కుమారుడు శ్రీ వై.ఎస్. రవీంద్రనాథ్ రెడ్డి కుటుంబం



దేవుని బలిష్ఠమైన చేతిలో దీనపాత్ర

# ఎస్. వెంకటరెడ్డి వంశవృక్షం





# తల్లి ప్రేమ

తల్లి ప్రేమ దేవుడు తన పిల్లల పట్ల కలిగి వున్న ప్రేమ యొక్క శ్రేష్ఠమైన ఉదాహరణల్లో ఒకటి. ఎందుచేతనంటే దైవభక్తి గల తల్లి ఎటువంటి ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పటికీ షరతులు లేకుండ తన పిల్లలను నిరంతరం ప్రేమిస్తూనే వుంటుంది. ప్రేమను తిరిగి పొందుకుంటాను అని ఎదురు చూడకుండా, స్వార్థం లేకుండా యివ్వడం, వారి పిల్లల గురించి ప్రార్థించడం, వారి కలలు నెరవేరుటకు వారికి సహాయం చేయడం వంటి కార్యాలతో తల్లులు దేవుని ప్రతిరూపాలుగా వుంటారు.

మాతృత్వంలో సంసోను బలం ఇమిడివుంది, సొలొమోను జ్ఞానం పొందుపరచబడింది, యోబు సహనం నిలిచి వుంది, అబ్రాహాము విశ్వాసం వుంది, దావీదు ధైర్యం మరియు కార్యనిర్వాహణ సామర్థ్యం గుప్తమై వుంది. అన్నిటి కంటె ముఖ్యంగా మాతృత్వం దేవుని ప్రేమ కూడ కలిగి వుంది. ఇది వాస్తవం.

స్త్రీని అత్యద్భుతమైన తల్లిగా నిలబెట్టునదేమంటే - తన సమయాన్ని, బలాన్ని, ఆరోగ్యాన్ని సహితం త్యాగం చేయగల నిస్వార్థ గుణమే.

www.ysjayamma.org
info@ysjayamma.org
+91.40.23334333